## అధ్యాయము 12

# ఐక్యత మరియు ఆత్మ సంబంధమైన వరములు

పదకొండవ అధ్యాయములో, తలమీద ముసుకువేసుకొనుట మరియు సమాజ భోజన సమయములో విభజనలు అను రెండు అంశములు, పౌలు మరియు కొరింథీయులకు మధ్య వత్తిడిని కలుగజేసిన ప్రధాన విషయములు. రెండు విషయములు "విగ్రహము లకు బలిగా అర్పించినవాటి విషయము"నకు సంబంధించినవి (8:1) మరియు సంఘ సమావేశ సమయములో సరైన ప్రవర్తన కొరకైనవి.[1] రోమా దేవతలను ఆరాధించువారికి తలమీద ముసుకు వేసుకొనుట భక్తికి చిహ్నములై యున్నవి, అలాంటి అభ్యాసము నుండి క్రైస్తవులు తమకు తాము వైదొలగవలసియున్నది. ఒకరికొకరు విడిపోయి సంఘము సాధారణ భోజనములో పాలు పొందినప్పుడు, ఇవి ప్రభువు రాత్రి భోజనములో ఉదహరించబడిన క్రైస్తవ సహవాసంలోని ముఖ్యమైనవి. క్రైస్తవ సహవాసములోని ఐక్యత, సన్నిహితత్వము మరియు పంచుకొనుటలోని ఉత్సాహమును వారు నిర్లక్షపెట్టారు. 11వ అధ్యాయం లోని అంశాలు 8 నుండి 10 అధ్యాయములలో పౌలు ప్రస్తావించిన సమస్యలు మరియు 12వ అధ్యాయములో ఆత్మీయ వరములకు సంబంధించి తరువాత పరిచయమునకు మధ్య, వారధివలె పనిచేసినవి.

కొరింథులోని క్రైస్తవులు, ఆరాధనకు సమాజముగా కూడి వచ్చినప్పుడు వారు ఎలా ప్రవర్తించవలెనను దానికి సంబంధించిన సమాచారము వారికి అవసరమైయున్నది. ప్రత్యేకముగా, సమావేశ ములో వారి ఆత్మీయ వరములను సరైన విధానములో ఎలా అభ్యసించవలెనో వారు నేర్చుకొనవలసియున్నదని పౌలు చెప్పు చున్నాడు. మనము "ఆత్మసంబంధమైన వరములను గూర్చి" (12:1) పరిచయము చేయబడిన, 12 నుండి 14 అధ్యాయముల అధ్యయన మును ప్రారంభించుదాము.

### "ఆత్మవలన మాటలాడుట" (12:1-3)

**1మరియు సహోదరులారా, ఆత్మసంబంధమైన వరములను గూర్చి మీకు తెలియకుండుట నాకిష్టము లేదు. 2మీరు అన్య జనులై యున్నప్పుడు మూగ**

**విగ్రహములను ఆరాధించుటకు ఎటుపడిన అటు నడిపింపబడితిరని మీకు తెలియును. [3]ఇందుచేత దేవుని ఆత్మవలన మాటలాడు వాడెవ డును యేసు శాపగ్రస్తుడని చెప్పడనియు, పరిశుద్ధాత్మ వలన తప్ప ఎవడును యేసు ప్రభువని చెప్పలేడనియు నేను మీకు తెలియజేయు చున్నాను.**

**వచనము 1.** (వరములను) గూర్చి అను మాట, పౌలుకు వారు వ్రాసిన పత్రికలో వారడిగిన ప్రశ్నకు వెనుకకు వారి శ్రద్ధను లాగుతుంది. 7:1లో, "మీరు వ్రాసినవాటి విషయము - స్త్రీని ముట్టకుండుట పురుషునికి మేలు;" మరియు 8:1లో, "విగ్రహము లకు బలిగా అర్పించినవాటి విషయము" అని పౌలు చెప్పాడు.

క్రైస్తవులైన తరువాత మరియు క్రైస్తవులు కాకముందున్న అభ్యాసములను జాగ్రత్తగా వేరుపరచవలసిన మరొక విషయముతో వ్యవహరించుటకు పౌలు సిద్ధముగా ఉన్నాడు. సంఘములో కొంత మంది పరిశుద్ధాత్మ ద్వారా తమకు అనుగ్రహింపబడిన అద్భుతమైన లేక **ఆత్మసంబంధమైన వరములను** అభ్యసిస్తున్నారు. పరిశుద్ధాత్మ వరములలో, విగ్రహారాధనకు సమాంతరముగా కనిపి స్తున్న కొన్ని వరములు ఈ మొదటి క్రైస్తవులకు ఇవ్వబడినవి. ఉదాహరణకు, స్వస్థపరచువారు మరియు స్వస్థతలకు సంబంధించిన నివేదికలు పురాతన ప్రపంచమునుండి ఇప్పటివరకు అందించబడినవి. దానితోపాటు, ఇశ్రాయేలీయులు లేక ఆదిమ క్రైస్తవులు ప్రవచించి నట్లుగా, అపొల్లో భక్తులు తరచు ప్రవచించుచుండగా "ప్రవచనము" అను మాట అదే పదజాలముతో నిర్వచించబడినది.

అనుగ్రహింపబడిన వరములతో అద్భుతముగా వ్యవహరించు అన్ని ప్రాంతముల మత ప్రజలనుండి, వరములు లేనివారికంటె, వరములు ఉన్నవారు దైవత్వముతో ప్రత్యేకమైన అనుబంధము కలిగి ఉన్నారని ఊహించటము సర్వసాధారణము. ఈ అనుమాన వాక్యమును పౌలు తిరస్కరించినాడు. ఈ క్రైస్తవులకు, అంతరంగ వ్యక్తిగత సంబంధములలో క్రీస్తులో జీవించు అనుభవమే ముఖ్యము గాని అద్భుతమైన వరములను కలిగియుండుట కాదు. అదే సమయములో, ప్రత్యేక అనుగ్రహము యొక్క ప్రాముఖ్యతను అపొస్తలుడు ఉపేక్షించలేదు. విగ్రహారాధకుల మధ్య అభ్యసించబడుతున్న మతాచారములు దేవుని దగ్గరనుండి వచ్చు వరములకు భిన్నమైన వని సహోదరులు ఎరిగియుండవలెనని అతడు కోరుకొనినాడు. క్రైస్తవుల కొరకైన వాటి ప్రత్యక్షత మరియు వాటి ఉద్దేశము స్వభావ ములో చాలా వ్యత్యాసమైనవి.

(πνευματικῶν, *pneumatikōn*) అను క్రియా విశేషణము తటస్థమైనది, ఆ విషయములో, "ఆత్మీయ విషయములు" లేక "ఆత్మీయ వరములు" అను 12:1లోని పదబంధము శ్రేష్టమైన తర్జుమాయైయున్నది. మరొక ప్రక్కన, అది పురుష నామమై యుండవచ్చును, ఈ విషయములో "ఆత్మీయ ప్రజలు" అని దాని అర్థము. దానిని అనుసరించివచ్చు చర్చనుండి, పరిశుద్ధాత్మ నుండి కొందరు కొరింథీయులు పొందిన వరములు పౌలు మనస్సులో ఉండి ఉండుట స్పష్టమైయున్నది (12:8 చూడండి). ఆ కారణమునుబట్టి, ఏటవాలు మాటలలో "వరములు" అను మాటను జొప్పించు NASB తర్జుమాదారుల నిర్ణయము తగినట్లుగా ఉన్నది. సాధారణ స్థాయిలో, దేవుడు

కొంతమంది ప్రజలకు గుర్తింపబడిన తలాంతులు లేక సామర్థ్యములను ఇచ్చియున్నాడు, అయితే పౌలు అద్భుత వరములను గూర్చి మాటలాడు యున్నాడు.

**వచనము 2. మీరు అన్యజనులై యున్నప్పుడు మూగ విగ్రహములను ఆరాధించుటకు ఎటుపడిన అటు నడిపింపబడితిరని మీకు తెలియును** అని పౌలు చెప్పినాడు. ἔθνη (*ethnē*) "ప్రజలు" అను గ్రీకుమాటనుండి వచ్చిన "అన్యులు" అను మాట దానికది వ్యతిరేకార్థమును కలిగి లేదు; అయితే సువార్త వృత్తాంతములలో సాధారణముగా యూదులకు విరుద్ధముగా అది వాడబడినది. అలాంటి సందర్భములో, ఆ మాట గౌరవ భంగము కలిగించే భావమును తీసికొంటుంది. "ప్రజలు," "అన్యులై"యున్నారు, అనగా, యూదేతరులు, నిర్వచనము ద్వారా విగ్రహారాధకులైన ప్రజలై యున్నారు. దేవుని గూర్చి మరియు ఆయన చట్టములను గూర్చి వారికి ఏమీ తెలియదు మరియు వారు దాని గూర్చి పట్టించుకున్నవారు కారు. అన్యులైన ఇశ్రాయేలీయులు దేవుని ప్రజలుగా ఆ స్థానములో చేర్చబడినారని పరిశుద్ధాత్ముడు సంఘమునకు తెలియజేసినాడు (ఉదా: రోమా. 2:29 చూడండి), అయితే మార్పు, *ethnē* అనే మాటకు క్రొత్త అర్థమును ఇచ్చినది. ఇంగ్లీషు మాటలాడువారికి, క్రైస్తవేతరులందరు "విగ్రహారాధకులు," గ్రీకు మాట అదే అయినప్పటికి, "అన్యులు" కాదు. 12:2లో పౌలు, కొంతమంది చదువరులు క్రైస్తవులు కాక ముందు మూగ విగ్రహములను ఆరాధించుచున్నప్పుటిజీవితములనుసూచిస్తున్నాడు.

గత నాలుగు అధ్యాయములలో పౌలు చర్చ వెనుక విగ్రహారాధన ఉన్నది, అయితే 12:2లోని మాటలు సమాజారాధన జరుగు చున్నప్పుడు క్రైస్తవ ప్రవర్తనలోనికి అతడు మారుటలో భాగమైయు న్నది. విగ్రహములను దేవుళ్ళుగా అనుకొనువారు మరియు నజరేయుడైన యేసు క్రీస్తుయొక్క తండ్రిని, ఈ విశ్వముయొక్క ఒకేఒక నిజమైన దేవుడుగా గుర్తించిన ప్రజలకు మధ్య ఉన్న ప్రవర్తనలోని ప్రాథమిక వ్యత్యాసములపై పౌలు దృష్టి ఉన్నది. పౌలులాంటి యూదులకు, యూదా చరిత్రలో మరియు లేఖనము లలో విరుద్ధత లోతుగా వేరుపారి ఉన్నది (యెషయా 44:9-11; యిర్మీయా 10:1-5; కీర్తనలు 115:3-8 చూడండి).

గతములో కొందరు కొరింథీయులు "మూగవిగ్రహములను" సేవించియున్నారు, అవి నిజముగా ఉన్నవి కాదు కాబట్టి అవి శక్తిలేనివి. క్రైస్తవుల ద్వారా ఆనందింపబడుతున్న ఆత్మీయ వరము లు, విగ్రహారాధనలోని ఆచారములతో తికమక పెట్టబడునవి కావు. ప్రవచనము, స్వస్థపరచుట లేక భాషలతో మాటలాడుట విగ్రహా రాధకుల ఆచారములకు కొన్ని ప్రత్యేక పోలికలు కలిగి యుండ వచ్చును; అయితే ఈ క్రైస్తవులు అభ్యసించునవి ప్రాముఖ్యముగా వ్యత్యాసమైయున్నవి.

**వచనము 3.** సహోదరులు తెలిసికొనవలెనని పౌలు ఏమి కోరుకొనినాడో మొదట అది మర్మమైనట్టుగా కనిపించవచ్చును. దేవుని **ఆత్మవలన మాటలాడువాడు** ఎవడైనా **యేసు శాపగ్రస్తుడు** (᾽Ανάθεμα ᾽Ιησοῦ, *Anathema Iēsous*) అని చెప్పుట ఊహించరానిది. ఎవడు అలాంటి పని చేయకపోయినట్లయితే, పౌలు హెచ్చరిక అత్యధికమైనది. కొంతమంది ప్రజలు "దేవుని ఆత్మ కలిగి యున్నాము" అని చెప్పుకొంటు, "యేసు శాపగ్రస్తుడని" చెప్పినట్లయితే, వారెవరైయుంటారు మరియు

వారిని ఏమి కదిలించి ఉంటుంది? అలాంటి మర్మమును వివరించుటలో అపొస్తలుడు ఎందుకు తప్పిపోయినాడు?

ఎవడైనా "దేవుని ఆత్మవలన మాటలాడువాడు" అలా చేసి ఉంటాడని సూచించుటకు ఒకవేళ పౌలు ఉద్దేశించి ఉండక పోవచ్చును. విగ్రహారాధ మత వ్యవస్థలలో భాషలతో మాటలాడుట మరియు ప్రవచించుట అను ఒకేవిధముగా కనబడు వరములను అభ్యసించుటను గూర్చి కొంతమందికి ఉన్న అభ్యంతరములకు అతడు స్పందిస్తు ఉండి ఉండవచ్చును. దేవుని ఆరాధించుటకు ఆ కార్యక్రమములు పూర్తిగా ప్రత్యేకమైనవి కావన్నట్టు కనిపిస్తుంది. Dionysus మరియు Cybele దేవతల యొక్క ఆరాధకులలో భావోద్రేక ములు అధికమైయున్నవనునది సర్వవిధితము. కొందరు క్రైస్తవులు (బహుశా యూదా క్రైస్తవులై యుండవచ్చును) క్రైస్తవులు భాషలతో మాటలాడుటను వ్యతిరేకిస్తు ఉండి ఉండవచ్చును, ఎందుకంటె విగ్రహములను ఆరాధించినవారు ఆ విధానములలోనే ప్రవర్తించ వచ్చును. పౌలు మాటలకు పిలువబడిన దృశ్యము అదే అయితే, అప్పుడు ఆత్మవరములను అభ్యసించువారిని అతడు కాపాడు తున్నాడు. ఒకవేళ అన్యదేవతల భక్తులు భాషలతో మాటలాడుట చూచేవారికి వారి తాత్కాలిక మానసికాందోళనను గుర్తు చేస్తు ఉండవచ్చును; అయితే సాధ్యమయ్యేలా చేయు పరిశుద్ధాత్మ శక్తి దీనిని క్రీస్తు అనుచరులకు గొప్ప అర్థవంతమైన ప్రత్యేకమైన దృశ్యముగా చేసినది. క్రైస్తవులలో నిర్వహించబడు దైవిక శక్తి విగ్రహారాధకులను కదిలించు ఉద్యమము వంటిది కాదు. "యేసు శాపగ్రస్తుడు" అని విగ్రహారాధకులు చెప్పినట్లు దేవుని ఆత్మచేత ఎవరు చెప్పరు: ఇంకా హృదయములోనుండి **యేసు ప్రభువు** అని ప్రకటించువారు, తాము పరిశుద్ధాత్మ ప్రభావము క్రింద ఉన్నామని తమ్మును తాము చూపించుకొంటున్నారు.

కాదనుటను బలపరచు ఉద్దేశముతో మాత్రమే అపొస్తలుడు తరువాతి ప్రకటనను చేసి ఉండవచ్చును. ఒకడు దేవుని ఆత్మద్వారా యేసును శపించుట, ఒకడు సొంత ప్రేరణతో మానసికోన్మాదపు స్థితి, యేసును ప్రభువని ప్రకటించుటవలె సంభవించెడిది కాదు, అది మరొక విధముగా చెబితే, ఒకడు ఆత్మ ప్రభావితుడై యుండగా, "యేసు శాపగ్రస్తుడు" అని చెబుతాడని ఊహించుట హాస్యాస్పదమ వుతుంది; అలాగే ఒకడు ఆత్మద్వారా నడిపింపబడ కుండ యేసు ప్రభువని గుర్తించలేడు. "యేసు ప్రభువని" నిజముగా ఒప్పుకొనుట, అలా చెప్పుకొనువాడు ఇంతకుముందే పరిశుద్ధాత్మ ప్రభావము క్రింద ఉన్నాడని దానికదే రుజువౌతుంది. యేసు దేవుని కుమారుడైన రక్షకుడు అను కొరింథీయుల సమిష్టి ఒప్పుకోలు, ఒకరినొకరు బలపరచుకొనుటకు కారణమైనది. ఒకరి వరముకంటె మరొకరి వరము గొప్పదను పోటీ ఆలోచనలను రానివ్వకుండ, వారు ఒకరి వరములవలన మరొకరు సంతోషించవలసియున్నది. శరీరము యొక్క ఐక్యతను నొక్కి చెప్పుట అపొస్తలుడు ఇంతకుముందే ప్రారంభించినాడు.

## వివిధములైన వరములు (12:4-11)

**4కృపావరములు నానావిధములుగా ఉన్నవిగాని ఆత్మయొక్కడే. 5మరియు పరిచర్యలు నానావిధములుగా ఉన్నవి గాని ప్రభువు ఒక్కడే. 6నానావిధములైన కార్యములు కలవు గాని అందరిలోను అన్నిటిని జరిగించు దేవుడు ఒక్కడే. 7అయినను అందరి ప్రయోజనము కొరకు ప్రతివానికి ఆత్మ ప్రత్యక్షత అనుగ్రహింప బడుచున్నది. 8ఏలాగనగా, ఒకనికి ఆత్మమూలముగా బుద్ధివాక్య మును, మరియొకనికి ఆ ఆత్మ ననుసరించి జ్ఞాన వాక్యమును, 9మరియొకనికి ఆ ఆత్మవలననే విశ్వాసమును, మరియొకనికి ఆ ఒక్క ఆత్మవలననే స్వస్థపరచు వరములను 10మరియొకనికి అద్భుత కార్యములను చేయు శక్తియు, మరియొకనికి ప్రవచన వరమును, మరియొకనికి ఆత్మల వివేచనయు, మరియొకనికి నానావిధ భాషలును, మరియొకనికి భాషల అర్థము చెప్పు శక్తియు అనుగ్రహింపబడియున్నవి. 11అయినను వీటన్నిటిని ఆ ఆత్మ యొకడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ప్రత్యేకముగా పంచి ఇచ్చుచు కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు.**

కొరింథీయులకు వ్రాసిన తన పత్రిక ప్రారంభ మాటల నుండి విశ్వాసుల మధ్య ఐక్యత అతని ఆసక్తియైయున్నది (1:10; 3:3 చూడండి). ఈ సహోదరులు ఐక్యతను గూర్చి అడుగలేదు; వారు ఆత్మీయ వరములను గూర్చి అడిగినారు, వాటిని ఎలా అమలు చేయవలెను, మరియు ఒకదానికంటె ఒకటి ఎంత ప్రాముఖ్య మైనవి అని అడిగినారు. అయినప్పటికి పౌలు ఈ ప్రశ్నలన్ని క్రీస్తు శరీరములోని ఐక్యత అంశము క్రింద ఉన్నట్లు చూచినాడు. అతనికి ముందు యేసుకు ఉన్నట్లే అపొస్తలుని ఆసక్తి ఉన్నది (యోహాను 17:20, 21). ఆయన తరువాత సుమారు నలభై సంవత్సరములకు రోమీయుడైన క్లెమెంతుకు ఉన్న ఆసక్తికూడ అటువంటిదే (క్రీ.శ. 98),[2] మరియు శతాబ్దముల తరబడి లెక్కలేనంతమంది ఇతరుల గూర్చిన ఆందోళన. క్రీస్తు శరీరము యొక్క స్వభావమునకు సంబంధించిన అతి ప్రాముఖ్యమైన విషయములను గూర్చి వ్రాయుటకు పౌలును ఆహ్వానించినవి ఈ ఆత్మవరములను గూర్చిన ప్రశ్నలే.

**వచనము 4.** 12:4లో పౌలు మనస్సులో ఉన్న **వరములు** (χαρίσματα, *charismata*), స్పష్టముగా 1 వచనములో అతడు ఉదహరించిన "ఆత్మసంబంధమైన వరములు" (*pneumatikōn*) వంటివే. "వరము"నకు క్రొత్తనిబంధనలో అతి సాధారణమైన గ్రీకు మాట "డోరాన్" (δῶρον, *dōron*); ఆ మాట యొక్క ఇతర రూపములు "డోరియా" (δωρεά, *dōrea*) మరియు "డోరెమా" (δώρημα, *dōrēma*). ఈ మూడు మాటలు క్రొత్త నిబంధనలో ముప్పైకంటె ఎక్కువ సార్లు కనిపించినవి, అయితే పౌలు తన పత్రికలో *dōrea* ఐదు సార్లు మరియు *dōron*ను ఒకసారి మాత్రమే వాడినాడు. మరొక ప్రక్క χάρισμα (*charisma*) అను మాట క్రొత్తనిబంధనలో పదిహేడు సార్లు కనిపిస్తుంది, వాటన్నిటిలో ఒక్కసారి మాత్రమే పౌలు పత్రికలో కనిపించదు. ఈ పదహారు సార్లలో 1 కొరింథీలోనే పౌలు ఆ మాటను ఏడుసార్లు వాడినాడు. 12వ అధ్యాయములో ఆ మాటను ఐదు సార్లు వాడినాడు. పౌలు *charismata* అను మాటను

"వరముల" కొరకు జాగ్రత్తగా ఎన్నుకొనినాడు; అది "కృప" χάρις (*charis*) మరియు "ఆనందం" χαρά (*chara*) అను మాటల యొక్క అదే వరుస అర్థమును పంచుకొంటుంది.[3] ఈ పదజాలము ను వాడుట ద్వారా, పౌలు తాను సూచించిన వరములు, క్రీస్తును ప్రభువుగా ఒప్పుకొనుట ననుసరించి వచ్చు కృప, ఆనందములు యొక్క పొడగింపులుగా దేవుని చేత ముద్ర వేయబడినవని తెలిపినాడు.

గ్రంథమును అనుసరించి వచ్చిన వరముల యొక్క వివరణ అవి అద్భుతమైన, శక్తులద్వారా సంక్రమించినవని సూచిస్తున్నాయి. దేవుడు తన ప్రజలకు చేయుదానంతటితో, నిత్యజీవమును కూడ కలిపి అంతవరకు దేవుని కృపా "వరములు" (*charismata*) ఉన్నవి (రోమా. 6:23); అయితే 1 కొరింథీ. 12-14 సందర్భము ఆ మాటపై హద్దులను ఉంచినది. ఆ మాట ప్రతిసారి కచ్చితముగా అదే అర్థమును ఇవ్వనప్పటికి, పౌలు ఇక్కడ "ఆత్మీయ వరములను" గూర్చిన ప్రశ్నలకు జవాబులిచ్చుచున్నాడు (12:1). అపొస్తలుని వరముల జాబితాను చూచినప్పుడు, ఆయన కొన్ని ప్రత్యేకమైన "వరములను" మాత్రమే చేరుస్తున్నాడని, వ్యాఖ్యానించువాడు అతని స్పందనలో కచ్చితముగా గమనించగలడు.[4] సంఘము అభివృద్ధి కొరకు ఈ ప్రత్యేకమైన వరములు పరిశుద్ధాత్మ ద్వారా ఇవ్వబడి నవి, అయితే మానవ గర్వము ఆత్మీయమైన వరములను వాటిని వ్యక్తిగత హోదా విషయములలోనికి మార్చుచున్నది. మరెక్కువ ప్రాముఖ్యతకొరకైన పోటీ, బహిరంగముగా అమలుపరచబడిన వరములు, సంఘములోని విభజనలకు సహకరించినవి.

దివ్యమైన వరముల యొక్క ముఖ్యమైన లక్షణము, ఈ వరములను పొందిన ఆదిమ క్రైస్తవులు వారి స్వంత చిత్తము చొప్పున వాటిని ఉపయోగించినారు. ఉదాహరణకు, పేతురు యోహానులు, దేవాలయ ఆవరణలో ఎంతో మంది కుంటి, గ్రుడ్డివారిని స్వస్థపరచి ఉంటారు. వారు ఏ వ్యక్తులను స్వస్థపరచవలెనో వారి స్వంత వివేచనతో ఎన్నుకొనినారు (అపొ. 3:6లో వలె). అదే విధముగా, స్వస్థత వరము కలిగిన ఇతర క్రైస్తవులు స్వస్థపరచుట ఎప్పుడు వారికి తగినట్లుగా అనిపిస్తుందో అప్పుడే వారు స్వస్థపరచి నారు. అలాగే, భాషలు మాటలాడుట లేక ప్రవచించు వరములు వారికి సంక్రమించినప్పుడు వారి స్వంత విచక్షణపై వారి వరములను అమలుపరచ కోరుకొనినారు (1 కొరింథీ. 14:32 చూడండి). ఈ వరములు వాడబడినప్పుడు మనస్సు మరియు చిత్తము పనిలో ఉన్నవి; వివరించలేనటువంటి విధానములో వారి ప్రవర్తన కారణమగునట్లు, ఏ కోరికలో లేక భావోద్రేకములో ఈ క్రైస్తవులను ఊడ్చివేయలేదు.

దేవుడు తాననుకొనిన సమయములో తన ప్రజల అభ్యర్థనలకు స్పందించి చర్య తీసికొంటాడు. మొదటి శతాబ్దములోని సంఘము లోవలె ఆధునిక కాలపు సంఘములో ప్రార్థనలకు ప్రభువు జవాబిచ్చుట, దేవుని నీతి చర్యద్వారా దివ్యమైన సంగతి. మొదటి శతాబ్దపు సంఘములో దివ్యమైన వరములను పొందినవారి యొక్క చర్యలు మరియు ఆధునిక సంఘ ప్రార్థనలకు దేవుని ప్రతిస్పందన మధ్య వ్యత్యాసము, ముందు చెప్పినవారు వారి విచక్షణపై శక్తులను అమలుపరచినారు. వారు వారి వరములను వారిష్ట ప్రకారము అమలుపరచునట్లు, దేవుడు వారిని నమ్మి దైవీకమైన విశేషాధికార ములను అప్పగించినాడు. ఈ భావములో దివ్యమైన వరములు ఆగిపోయినవి; వ్యక్తులు

వారి విచక్షణపై ఆధారపడి దేవుని శక్తిపై దృష్టి నిలుపుటకు మరియు అద్భుత కార్యములను చేయుటకు ఇక ఎంతమాత్రము అధికారము కలిగిలేరు. ఆకరికి మొదటి శతాబ్దపు సంఘములో దివ్యమైన వరములు పొందిన వ్యక్తులు ఎల్లప్పుడు దేవునికి లోబడి యుండెడివారు. వారు దేవుని చిత్తమునకు విరుద్ధముగా అద్భుతములు సూచక క్రియలు చేయు ప్రయత్నము చేస్తే, దేవుడు తన కోరిక చొప్పున జోక్యము చేసికొనెడివాడు.

అద్భుతములు చేయునట్లు ప్రతివానిని అనుమతించునట్లు ఆత్మద్వారా క్రైస్తవులందరికి వరములు (*charismata*) ఇవ్వబడలేదని కొరింథీయులు ఎరుగుట ప్రాముఖ్యమైయున్నది. అద్భుతముగా బలపరచబడినవారి మధ్య ఆ ఆత్మ యొక్క పని వివిధ పద్ధతులలో తెలియజేయబడినది. శరీరమునకు విశ్వాసము మరియు వికాసము ను తెచ్చు దేనిలోనైనా సంతోషమును కనుగొనుట మరియు ఇతరుల వరములను గౌరవముతో చూచుట ప్రతి క్రైస్తవునికి అవసరమైయు న్నది. వ్యక్తిగత వరముల స్వభావమును లెక్కపెట్టకుండ, "ఆ ఆత్మ" కొరింథీయులందరిని ఒక్క శరీరములో అతికించినాడు. ఆత్మసంబంధ మైన వరములు కలిగి యున్నవారిని పౌలు హెచ్చరిస్తున్నాడు. ప్రత్యేకముగా వరములు సంక్రమింపబడిన వ్యక్తులు వారి వరములను గూర్చి మరియు వాటిని నియంత్రించు వారి సామర్థ్యమును గూర్చి స్పష్టముగా ఎరిగియున్నట్లు కనిపిస్తుంది. ఎవరు శ్రేష్టమైన వరములు కలిగి యున్నారను పోటీకి చుక్కపెట్టుట అవసరమని పౌలు అనుకొనినాడు.

**వచనములు 5, 6.** ప్రభువు సమస్త మంచితనమునకు ఆధారమై నందున ఆత్మద్వారా ఇవ్వబడిన వరములన్నియు "పరిచర్యను" (διακονία, *diakonia*) సూచిస్తున్నవి. **పరిచర్యలు నానావిధములు**గా ఉన్నందున క్రైస్తవులు ఆశ్చర్యపడవలసిన పనిలేదని అందుచేత నానావిధమైన వరములు ఆ **ఒక్క ప్రభువు**చేతనే ఇవ్వబడినవని పౌలు చెప్పినాడు. సహోదరులు వారికివ్వబడిన వరములలో నానావిధములైనవాటిని చూడవచ్చును మరియు ప్రభువు తన సేవకులకు ఇచ్చిన నానావిధ "పరిచర్యల"తో వాటిని జోడించి చూడవచ్చును. ఉదాహరణకు, కొందరు అపొస్తలులు, కొందరు పెద్దలు, కొందరు పరిచారకులు, మరియు కొందరు సువార్తికులు (12:29; ఎఫెసీ. 4:11 చూడండి). దేవుడు నానావిధములైన ఆత్మ వరములను ఇచ్చినప్పుడు, దాని ఫలితముగా పరిచర్యకు సిద్ధపడి యుండవలెను. పౌలు, తమ సహజజ్ఞానమును వాడమని కొరింథీయులను విన్నవించుకొంటు న్నట్లు కనిపిస్తుంది. ప్రజలు వేరువేరుగా ఉండుట వలన ఆత్మ ప్రతివారికి తగిన వరయును అనుగ్రహించినాడు.

"ఆత్మ ఒక్కడే," "ప్రభువు ఒక్కడే" మరియు **దేవుడు ఒక్కడే**, వీరు "నానావిధమైన వరములను," "నానావిధమైన పరిచర్యలను" మరియు క్రైస్తవులలో **నానావిధమైన కార్యములను** జరిగించినారు (12:4-6). 12:6లో KJV "నానావిధమైన కార్యముల"కు బదులు "నానావిధమైన పనులు" అని సూచించినది. CEV "మనలో ప్రతివారము వేరు వేరు కార్యములు చేయవచ్చును. అయితే అదే దేవుడు మనందరిలో పనిచేస్తు మనము చేయు ప్రతిపనిలో మనకు సహాయము చేస్తాడు" అని సాధారణముగా చెప్పినది. ఆత్మ

వరము కలిగియుండుట, ఒకని స్థాయిపెరిగి ఆత్మీయ స్థితిలో ఉన్నతముగా జీవిస్తున్నట్లో లేక దేవుని దగ్గర ప్రత్యేకమైన దయ పొందినట్లో కాదు. ఆత్మీయ వరములు సంఘ నిర్మాణము కొరకు, వ్యక్తిగత ఆడంబరము కొరకు కాదు. ఆ కార్యములన్నిటిని దేవునికి, క్రీస్తుకు మరియు ఆత్మకు ఆపాదించుట ద్వారా పౌలు దైవత్వపు ఏకత్వమును స్థిరముగా చెప్పినాడు. దేవుడు, క్రీస్తు మరియు పరిశుద్ధాత్మ కార్యములన్నీ ఒకదానికొకటి పెనవేసికొనియున్నవి. "త్రిత్వము" అను మాట కనిపించనందున, ఈ దైవత్వపు ఏకత్వ సందర్భము క్రొత్తనిబంధన అంతట కనబడుతుంది.

క్రైస్తవులు ఒకరినొకరు బలపరచుకొంటు, ప్రోత్సాహించుకొంటు, ఒక్క శరీరములో బంధింపబడి యుండవలెనని పౌలు ఉద్దేశము. ఇతర విషయములన్నిటిలో, ఆత్మీయ వరములు, క్రీస్తు సంఘము యొక్క ఐక్యతకు సహాయపడుటకు ఇవ్వబడినవి. ఏ క్రైస్తవుడైనా తన ఆత్మీయ వరము దేవుని ప్రత్యేక దయను సూచిస్తుందని అర్థము చేసికొనినట్లుయితే, అసాధారణముగా ఏదైనా చేయు శక్తితో దేవుడు ఇతరులను దీవించినాడా లేదా అని చూడకుండ, ఇతరులపై కూడ దేవుని దయను గుర్తించవలసి యున్నది.

**వచనము 7.** ఆత్మీయ వరములు **అందరి ప్రయోజనము కొరకు** అని పౌలు చెప్పినాడు. REBలో "కొంత ఉపయోగకరమైన ఉద్దేశము కొరకు" అని ఉన్నది. దేవుడు **ఆత్మ ప్రత్యక్షతను**, అనగా ఆత్మీయ వరములను, వాటిచేత అదుపుచేయబడు వ్యక్తుల గొప్పతనము కొరకు అనుగ్రహించలేదు. సహోదరుల మధ్య పోటీ మరియు విభజనల సందర్భమునకు దూరముగా ఆత్మీయ వరములు అందరి ప్రయోజనము కొరకు ఇవ్వబడినవి. ఒంటరిగా ఉండుట మరియు ఒంటరిగా అనుభవించుట కాక, విశ్వాసులను ఒకరితో ఒకరిని ఏకముచేసి, శరీరమును బలపరచుట పరిశుద్ధాత్మ పని. పౌలు జాగ్రత్తగా చర్చను తిరిగి చెప్పినాడు." ఆత్మసంబంధమైన వరములను గూర్చి," దీనికి బదులు పౌలు "అందరి ప్రయోజనము కొరకు" లేక "శరీరముయొక్క ఐక్యత కొరకు" అని ఆలోచిస్తున్నట్లు కనిపిస్తుంది. ఆత్మీయ వరములను కలిగియుండి వాటిని ఉపయోగించుటలో కొరింథీయుల పైఖరి, సంఘ విభజన సమస్యకు ఆధారమైన రోగల క్షణమైయున్నది. వరముల వర్ణన, కొరింథీ సంఘమునకు ఉపద్రవ మైన విభజనల విస్తృతిలోనికి అంతర్ దృష్టిని ఇస్తుంది. ప్రతి దానిని జాగ్రత్తగా చూచుట యోగ్యమైయున్నది.

**వచనము 8.** 12:7లో తన సూచనను "ఆత్మ ప్రత్యక్షత అనుగ్రహింపబడుచున్నది"కు విస్తరిస్తు, ఆత్మయొక్క ప్రత్యేక వరములను లెక్కించుట ద్వారా అపొస్తలుడు సాధారణ హెచ్చరికను వెలుగులోనికి తెచ్చినాడు. కొరింథీ క్రైస్తవులు, ఎంతో గొప్పగా వాటిని ఎత్తిపట్టుకొని వాటిపై పోటీ పడునట్లు కనిపించుటకు, దృశ్యమైన వరములతో అతడు ప్రారంభించలేదు. అంతకంటె పౌలు శరీర సంక్షేమము కొరకు గొప్ప విలువ కలిగిన అతి సాధారణ వరములతో ప్రారంభించినాడు. సంఘములో, **ఒకనికి ఆత్మ మూలముగా బుద్ధి వాక్యమును, మరియొకనికి ఆ ఆత్మ ననుసరించిన జ్ఞానవాక్యమును** ఇచ్చుట ఆత్మ పనియైయున్నది. ఇవి "అందరి ప్రయోజనముకొరకు ఆత్మ ప్రత్యక్షతయైయున్నవి"; అయితే తక్కువగా కనిపించు వరములు, వాటిని కలిగి

యున్నవారు లేక వాటిని ప్రదర్శించువారిలో కొద్దిపాటి ఉద్రేకమునకు కారణమైనవి.

జ్ఞానవాక్యపు వరము యొక్క సంబంధములో బుద్ధి వాక్యపు వరమును గూర్చి పౌలు ఉద్దేశమేమిటో తెలిసికొనుటకు అది సహాయకరముగా ఉంటుంది. ఒకవేళ బుద్ధివాక్యము, "ప్రవచించు వరము లేక జ్ఞానవాక్యము ద్వారా బయలుపరచబడిన జ్ఞానము యొక్క సూచనలను చూచుటకు ప్రేరేపించు సామర్థ్యమై" యుండ వచ్చును, అనగా "వ్యక్తిగత మరియు సంఘ జీవితములకు దేవునినుండి వచ్చిన వాక్యమును ఇతరులపై ఎలా అన్వయించ వలెనో ఆజ్ఞాపించు సామర్థ్యమై"[5] యుండవచ్చును. ఇక్కడ చెప్ప బడిన బుద్ధి మరియు జ్ఞానమును గూర్చి మానవ బుద్ధితో తికమక పడవలసిన పనిలేదని స్పష్టమగుచున్నది. ఈ యుగపు జ్ఞానముతో పరిశుద్ధాత్మ వరములను గూర్చి ఏమీ చేయవలసిన పనిలేదు.

ఆత్మ యొక్క అద్భుతమైన ప్రత్యేక్షతల నుండి సహజ సంక్రమణలుగా బుద్ధి జ్ఞానమును పౌలు వేరుపరచలేదు. కొరింథులో విశ్వాసుల మధ్య విభేదములు స్పష్టమైయున్నవనుటలో సంశయము లేదు. లేకపోతే, అపొస్తలుడు వారిని సంబోధించి వ్రాయవలసిన పనిలేదు. అద్వితీ యమైన బుద్ధిని లేక ఏ ఆత్మ వరమునైనా నియమించుటలో ఆత్మద్వారా వాడబడిన ప్రమాణము యొక్క ఏ సూచనను మనము కనుగొనలేదు. పౌలు తన అపొస్తలత్వపు అధికారముతో, కొంతమంది వ్యక్తులపై చేతులుంచి సమరయుల మధ్యలో పేతురు యోహానులు చేసినట్లు సంఘమునకు సేవచేయుటకు వారిని పంపించినాడా (అపొ. 8:14-18)? ఈ సమయములో అపొస్తలులు వారి చేతులు ఉంచుట ద్వారా అద్భుత వరములను యివ్వక పోయినట్లయుతే, ఆత్మ కొన్ని రహస్య సాధనముల ద్వారా వరముల కొరకు విశ్వాసులను ఎన్నుకొనినను, ఆత్మ ఆలోచించకుండ ఎన్నుకొన్నాడని ఒకడు బలవంతముగా ముగింపునకు వచ్చునట్లు కనబడుతుంది. అలాంటి విషయములో, విశ్వాసులు ఒక ఉదయమున వారు మేలుకొనగానే, వారు అర్థము చేసికొనని మరియు వారు కోరుకొనని అసాధారణ సామర్థ్యములు కలిగియున్నారని కనుగొటారు. అయితే, అపొస్తలుల నియమాక సాధనము ద్వారా ఆత్మీయ వరములు కొరింథుకు వచ్చినవని సూచించు కారణము లేక క్రమము కొరకు పౌలు పత్రిక మనవి చేస్తుంది (1 కొరింథీ. 14:40).

**వచనము 9.** బుద్ధి, జ్ఞానములవలె, **విశ్వాసము** ప్రతి క్రైస్తవుని యొద్దనుండి ఎదురు చూచునట్టి సహజముగా సంక్రమించునదై యున్నది. అయితే ఇక్కడ విశ్వాసము ప్రశ్నార్థకములో ఉన్నది, బుద్ధి, జ్ఞానములు ఇంతకుముందే ఉదహరించబడినట్లు, **ఆ ఆత్మ** ద్వారానే ప్రత్యేకమైన వరము ఇవ్వబడినది. ఒకవేళ "ఆత్మీయ వరము"గా విశ్వాసములో అద్భుతమైన మూలకము ఉన్నట్లయితే, శోధనలను అడ్డుకొనటకు లేక కొరింథీ బోధను అసాధారణమైన సవాలుతో ఎదుర్కొనుటకు తగినంత సామర్థ్యము కలిగి ఉంటుంది. ఉదాహరణకు, వారు గ్రీకు తత్వవేత్తలను తిరస్కరించినప్పుడు, విశ్వాసము యొక్క ఒకస్థాయి అద్భుతము విశ్వాసులకు సహాయకర ముగా ఉండి ఉంటుంది. క్రైస్తవ ఒప్పుకోలునకు ఆధారమైన సాధారణ విశ్వాసముతో, ఆత్మ స్వభావము ద్వారా సంక్రమించిన విశ్వాసమును

పోల్చినప్పుడు, దాని గురించి నేటి క్రైస్తవుడు అతడు/ఆమెకు ఎక్కువగా తెలియదనునది సంపూర్ణ నిశ్చయమై యున్నది. అయితే కొరింథులోని సంఘములో విశ్వాసము ప్రశ్నార్ధకమవుటనుబట్టి ఆత్మ యొక్క ప్రత్యేక సంక్రమణ, అద్భుతమైన వరమని మనము సంపూర్ణముగా నమ్మవచ్చును.

ఆత్మ యొక్క తక్కువ ఆశ్చర్యమైన ప్రత్యక్షతలను వివరించిన తరువాత - ఒకని స్వంతదని ఆసక్తితో కోరుకొను అవకాశములేని వరములు - అనగా, కొరింథీయులు పోటీపడుతున్న వరముల వైపునకు పౌలు తిరిగినాడు. **స్వస్థపరచు వరములపై** ప్రాముఖ్యమైన విగా విశ్వాసము, బుద్ధి మరియు జ్ఞానమును ఇచ్చుట ద్వారా, వరములన్ని దేవుని దగ్గరనుండి వచ్చినవని మాత్రమే గాక, మొదటివి కూడ ఎక్కువగా కోరదగినవని అపొస్తలుడు తెలియ జేసినాడు.

"స్వస్థపరచు వరములు" అని పౌలు బహువచనమును వాడుట, అది శైలికి సంబంధించిన సాధారణ విషయమై యుండవచ్చును, అయితే సందర్భము అది గుర్తింపు కలిగినదని సూచిస్తుంది. బహుశా కొందరు కొన్ని పరిస్థితులలో మాత్రమే స్వస్థపరచు వరములను చేయగలుగుతున్నారు. స్వస్థపరచు వేరు వేరు వరములు, వాటిని కలిగియున్నవారిని సంఘములో ప్రాముఖ్యము కలిగియుండునట్లు అనుమతిస్తున్నాయి అనునది స్పష్టమైయున్నది. వరముల వెనుక ఉన్న ఉద్దేశము ఎప్పటికి ఇది కాదని; ఆత్మ వరములన్ని శరీరమంతటి యొక్క అభివృద్ధి కొరకైనవని పౌలు నొక్కిచెప్పు చున్నాడు. ఏ సంస్థలోనైనా, క్రైస్తవునిలోనైనా లేక ఇతరులలోనైనా కదలికకు వాటి అభ్యాసములు కారణమైయుండ వచ్చునని, "స్వస్థపరచు వరము"లను పేర్కొనుట వరుస సామర్థ్యములను పరిచయము చేస్తున్నాయి.

**వచనము 10ఎ.** అధిక ఆసక్తి కలిగించే వరములపై వత్తిడిని తగ్గించుటకు మరియు వాటి ప్రాముఖ్యతను పరిశీలించుటకొరకు తక్కువగా కనబడు ఆత్మీయ వరములను (బుద్ధి, జ్ఞానము మరియు విశ్వాసము) అపొస్తలుడు మొదట ఉంచియున్నాడు. **అద్భుతకార్యములను చేయు** శక్తి, క్రింది వరముల ఏర్పాటు క్రింద విస్తృతముగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఆ విషయములో, "స్వస్థపరచు వరములు" తప్పు స్థలములో ఉన్నట్లు కనిపిస్తుంది. ఒకడు అది "అద్భుతకార్యములను చేయు శక్తి"ని దాటకుండ దానిని అనుసరించి ఉండవలెనని ఎదురుచూడవచ్చును. కొరింథులోని క్రైస్తవులు ఇతర వరములకంటె స్వస్థపరచు వరములను ఎక్కువగా కోరుకొనియుండ వచ్చును. జీవితమును ఎక్కువ కాలము కొనసాగించ వలెనను వ్యక్తిగత కోరికనుబట్టి, పరిశుద్ధాత్మ ద్వారా పంచబడిన వరము లన్నింటికంటె స్వస్థపరచు శక్తిని ఎక్కువ ఆశపడియుండ వచ్చును. యేసు మరియు అపొస్తలుల ద్వారా చేయబడిన అద్భుతములు ఎక్కువ స్వస్థపరచు అద్భుతములని నివేదించబడినది.

కారణమేమైనప్పటికి, పౌలు "అద్భుత కార్యములు చేయు శక్తి" అను అధిక సాధారణ పదజాలము ముందు "స్వస్థపరచు వరములను" వ్రాసియున్నాడు. దాని తరువాత, కొరింథీ క్రైస్తవుల ద్వారా అభ్యసించబడుచుండగా, అద్భుత వరములను వేవేరు ప్రత్యక్షతలను విడివిడిగా వ్రాసినాడు.

**వచనము 10బి.** ఇతర అద్భుత వరముల మధ్య, కొరింథులో కొంతమంది ప్రజలు

**ప్రవచన** వరముతో ఆత్మద్వారా బలపరచబడి నారు. ఆదిమ సంఘములో ప్రవక్తలు గౌరవించబడినారు; వారు ప్రాముఖ్యమైన సేవలు అందించినారు (ఎఫెసీ. 2:20; 4:11). అగబు భవిష్యత్తును ముందుగా చెప్పినాడు (ఉదాహరణకు, అపొ. 11:28; 21:10, 11), అయితే ప్రవక్తలు అతి సాధారణముగా బోధించెడివారు (అపొ. 15:32). క్రైస్తవ ఉపదేశకుడు తప్పనిసరిగా ఆత్మ ద్వారా సంక్రమించిన అద్భుతములు కలిగియుండ వలసిన అవసరము లేదు, అయితే ప్రవక్తకు అవసరమైయున్నది. James Greenbury యొక్క ముగింపు స్పష్టముగా ఉన్నది:

> ఆ విధముగా, క్రొత్తనిబంధన అంతట సూచించుటకు బలవంత పెట్టబడిన రుజువేమి లేదు, ప్రవచనము ఏకరూప బయలుపాటుకంటె ప్రేరేపింపబడిన మరియు అధికారముతో కూడిన దేదైనా అయి ఉండవచ్చును.[6]

ప్రవచనము, దేవుడు తన సేవకులకు ఇచ్చిన పురాతన వరమైయున్నది; అయితే పాత, క్రొత్తనిబంధనలు రెండింటిలో, ప్రజలు తమ స్వంత మనస్సులలో నుండి మాటలాడుచున్నప్పుడు నిజముగా అది దేవునినుండి వచ్చిన సందేశమని చెప్పుకొనినారు (యిర్మీయా 27:16). కాబట్టి, **ఆత్మల వివేచన** వరమును ప్రజలకు యిచ్చుట, ఆత్మకు ఆవశకమై యున్నది. మొదటి శతాబ్దపు సంఘ జీవితమునకు ప్రవచనము ప్రాముఖ్యమైయున్నది. కొంతమంది ప్రవక్తలు కొన్ని ప్రత్యేకమైన సంఘములలో స్పష్టముగా నిర్వచించ బడిన పనులతో స్థిరముగా ఒకచోట స్థిరపడియున్నారు. ఇతరులు, నిజమైన ప్రవక్తలైనా లేక అబద్ధమైన ప్రవక్తలైనా; ఒక స్థలము నుండి మరొక స్థలమునకు తిరుగుచున్నట్లు కనిపించినది (1 యోహాను 4:1).

**వచనము 10సి.** పౌలు కనీసము కొరింథీయులకు సంబంధించి అధిక ఆసక్తి కలిగించే వరములను నశించిన వారికొరకు కాపాడినాడు. **నానావిధ భాషలతో** మాటలాడు సామర్థ్యము కొరకు క్రైస్తవులు పోటీ పడినారు. ఈ భాషలు “నానావిధములైన”వని పౌలు అర్థము చేసి కొనినాడు. ఆధునిక ప్రపంచములో అనుభవిస్తున్న పారవశ్యముతో పలుకు మాటలనుబట్టి వాటికి పోలిక సంబంధమున్నది, “నానా విధముల” ద్వారా ప్రత్యేకింపబడుటకు కొరింథులో పారవశ్యముతో పలుకు మాటలు ఎదురుచూడ బడలేదు. నేడు కొన్ని ప్రత్యేక మతగుంపులు చెప్పుకొంటున్న పలుకులు ఉద్రేక (“మతపరమైవని” కొందరు చెప్పుకొంటారు) అనుభవముతో ఉన్నట్లు కనిపిస్తుంది, అయితే అలాంటి “భాషల” ప్రదర్శన వివేకమైన విషయమును అందించుటకు ఎదురు చూడబడలేదు. పౌలు ద్వారా చర్చించబడిన “నానావిధములైన భాషలు” వేరు వేరు ప్రాంతములకు సంబంధించిన భాషలు; అవి వివేకవంతమైన ఆలోచనలను అందిస్తాయి.

పౌలు "వ్యాఖ్యానమును" కోరుతున్నాడని కొరింథు సంఘములోని వారు గ్రహించినప్పుడు పాఠకులు అద్భుతమైన భాషలను గూర్చి అర్థము చేసుకొనుటకు సుదీర్ఘమైన మార్గంగా ఎంచుకున్నారు. కొరింథులోని కొంతమంది క్రైస్తవులకు "ఆత్మలు" మధ్య వ్యత్యాసమును తెలుసుకొనుట అవసరమయ్యింది. అంటే ప్రవచన సందేశముందని చెప్పువారికి మరియు నిజముగా ప్రవచన సందేశము ఉన్నవారికి

మధ్య వ్యత్యాసం గమనించాలి. ఆత్మచే అధికార పూర్వకంగా మాట్లాడుతున్నాని చెప్పు ప్రతివారిని సహోదరులు బలపరచలేదు. భాషలు సంఘ క్షేమాభివృద్ధికొరకైతే, భాషల అర్థము చెప్పవలెను. వరములు గల క్రైస్తవులకు ఆత్మ ఇచ్చిన స్వర శబ్దాలు వివిధమైన నత్తిగా మాట్లాడాడే మాటలు కావు. వారు అర్థవంతమైనవి. "వివిధ రకాల భాషలు" భాషలే; అవి హేతుబద్ధమైన ఆలోచనలను తెలియజేయునవి.

క్రొత్తనిబంధన పత్రికలలో (స్వస్థత మరియు ప్రవచనములవలె కాక) భాషలు 1 కొరింథీయులకు వ్రాసిన పత్రికలో మాత్రమే ఉదహరించబడినవి. కొరింథీయులకు ఇవ్వబడిన ప్రత్యేకమైన వరమును పరిశీలించుటలో ఎంతో జాగ్రత్త అవసరమైయున్నది. పౌలు పత్రిక యొక్క ఆధునిక చదువరులముగా, మనము ఆయన ఉపదేశములనుండి లబ్ధిపొంద వచ్చును, కొరింథులో ఉన్న "నానావిధమైన" భాషలు ఏమైయున్నవో కొంతమట్టుకు ఇక్కడ మాత్రమే మనము అర్థము చేసికొనవచ్చును.

క్రొత్త నిబంధనలో ఎక్కడో మరోచోటున "భాషలు" అను పదము కనిపించేది అపో. 2:7, 8; 10:46; మరియు 19:6లో మాత్రమే. అపొస్తలుల కార్యములు 2లో అది స్పష్టముగా (వివిధ ప్రజలు మాటలాడు) భాషలుగా సూచించబడినది. సిద్ధాంతమును ఉపయోగించుటవలన స్పష్టమైన వాక్యభాగములు కష్టమైన వాటిని వ్యాఖ్యానించుటకు మనకు సహాయపడతాయి, అపొస్తలుల కార్యములు మరియు 1 కొరింథీయులకు 12-14లో యింకెక్కడైనా "భాషలు" వాడబడినట్లయితే వాటిని మనము (వివిధ ప్రజలు మాటలాడు) భాషలుగా తీసికొనవలెను. మరికొంత వివరణతో వాదించుటకు, అపొ. 2లో భాషల వరము ఒక దృక్పథము మరియు 1 కొరింథీలో పూర్తిగా వ్యత్యాసమైనది, ఇది స్పష్టముగా సమాచారమిచ్చుటలో క్రొత్త నిబంధన సామర్థ్యమును ప్రశ్నిస్తుంది.[7] భాషతో మాటలాడుట అనగా, "ఆత్మద్వారా ప్రేరేపింపబడిన భాష, భాషకాని దానిని పలుకు అభిప్రాయము కాదు. అది కేవలము ఆత్మలో అస్పష్టమైన గొణుగులు కాదు." అని పౌలు అర్థము చేసికొనినాడు అని ముగింపునకు వచ్చుటలో David E. Garland స్పష్టముగా ఉన్నాడు.[8]

"క్రొత్తనిబంధనలో అనునాసికమై భాష వివరించబడినదో లేదో, హెల్లేనియుల మతములో కనుగొనబడిన పారవశ్య ప్రసంగమునకు మరియు బహుశా పాతనిబంధన ప్రవచనములో దానికి అది నిజముగా పోలికేగా ఉన్నది" అని Robert H. Gundry వ్రాసిన వ్యాసము పరిశీలిస్తుంది. "'పారవశ్యముగా పలుకు' దృశ్యముగా అపొస్తలుడైన పౌలు దానిని చూడలేదు లేక వివరించను లేదు, అయితే మానవ భాషను మాటలాడుటకు వక్తకు అద్భుతముగా సామర్థ్యము ఇవ్వబడియున్నది" అని అది చెబుతుంది.[9]

**వచనము** 11. క్రీస్తు శరీరము యొక్క ఐక్యత పౌలు వరముల సంక్షేపములో విస్తృతముగా నేయబడుట కొరింథీ క్రైస్తవులలో రుజువైయున్నది. అతడిలా వ్రాసినాడు, **అయినను వీటన్నిటిని ఆ ఆత్మ యొకడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ప్రత్యేకముగా పంచి ఇచ్చుచు కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు.** అధిక వాంఛనీయమైన వరములకొరకు క్రైస్తవుల మధ్యలో పోటీ, వారు వాటిని అపార్థము చేసికొని, ఆత్మ పంచియిచ్చిన సామర్థ్యములను తప్పుగా ఉపయోగిస్తున్నారని సూచిస్తుంది.

శరీరము అనగా, సంఘములోని వివిధములైన అవయవములు, శరీరముయొక్క ముఖ్యమైన ఐక్యతను తగ్గించని విధానములో వేరు వేరు సామర్థ్యములు కలిగియున్నారు అనునది వాస్తవము. భౌతిక శరీరములోని అన్ని అవయవములవలె, సంఘ సభ్యులందరు, కలసి పనిచేయవలసియున్నది. క్రీస్తు శరీరములోని ఒక అవయవము ప్రత్యేక సామర్థ్యముతో దీవించబడినప్పుడు, అది శరీరమంత సంతోషించు సమయమైయున్నది.

## "శరీరము ఏకమైయున్నది" (12:12, 13)

**12ఏలాగు శరీరము ఏకమైయున్నను అనేకమైన అవయవ ములు కలిగియున్నదో, యేలాగు శరీరము యొక్క అవయవము లన్నియు అనేకములైయున్నను ఒక్క శరీరమైయున్నవో, ఆలాగే క్రీస్తు ఉన్నాడు. 13ఏలాగనగా, యూదులమైనను, గ్రీసుదేశస్థుల మైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను, మన మందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను పానము చేసిన వారమైతిమి.**

**వచనము 12.** 12:12లో పౌలు 12:1-11యొక్క సంక్షేపమును "ఆలాగే సంఘము ఉన్నది" అని చెప్పవలెనని మనము ఎదురు చూచి ఉండవచ్చును. సంఘము యొక్క ఐక్యత అపొస్తలుడు ఇంతకుముందు చేసిన వివరణను గట్టిగా చుట్టి ఉంచినది, అయితే అతడిప్పుడు మరొక వైపునకు తిరిగినాడు. "ఆలాగే సంఘము ఉన్నది" అని చెప్పుటకు బదులు **అలాగే క్రీస్తు ఉన్నాడు** అని అతడు వ్రాసినాడు. కొరింథులో సంఘమును స్థాపించినవాడు క్రీస్తు మరియు ఆయన సంఘములో ఐక్యతను నొక్కిచెప్పినాడు. శరీరములో భాగముగా ఉండటమంటె క్రీస్తుతో కలిసి ఉండటమని అర్థము.

Asclepion దృష్టిలో, పురాతన కొరింథు పశ్చిమ గోడలో స్వస్థత మందిరము కలిసి ఉన్నది, పురాతత్వశాస్త్రవేత్తలు టెర్రాకోట్టా (terra-cotta) శరీర భాగములను భద్రపరచు స్థలమును కనుగొనినారు. దేవతకొరకైన వారి చింతను జ్ఞాపకార్థముగా విడిచిపెట్టుటకు లేక ఒకవేళ వారు పొందిన స్వస్థతను వారి దేవతకు ఆపాదించుటకు కృతజ్ఞతను తెలుపుటకొరకు భక్తులద్వారా అవి అక్కడ ఉంచబడి ఉంటాయి. టెర్రాకోట్టా (terra-cotta) శరీర భాగములు కొరింథులో ఆధునిక పురావస్తుశాస్త్ర విభాగస్థలములో ఒక చిన్న వస్తుప్రదర్శన శాలలో ఉంచబడియున్నవి. పౌలు ఆ మందిరమును దర్శించి అస్క్లెపియస్ (Asclepius) దేవత అనగా వైద్య దేవత ఆరాధకులద్వారా విడిచిపెట్టబడిన వివిధ ఆకారముల మొత్తమును చూచి ఉంటాడని ఊహించటము కష్టము కాదు. Jerome Murphy-O'Connor ఇలా ఊహించినాడు:

> ఈ నేపథ్యమునకు విరుద్ధముగా క్రైస్తవులు ఉండకూడని ప్రతి దానికి గుర్తుగా Asclepion విడదీయబడిన శరీరభాగముల ప్రదర్శనను పౌలు చూచి ఉండవచ్చును: "మరణము," విభజన, ప్రేమించనివారు మరియు ప్రేమింపబడనివారు. దీనినుండి, పూర్తి శరీరము యొక్క విశిష్టభేదమును చూపు ఆకారమును, దానిలో పంచుకొనబడు

జీవితములో వేరుపారిన ప్రతి సభ్యునియొక్క ప్రత్యేకగుర్తింపును, తెలిసికొనుటకు ఇది తేలికైన మెట్టు.[10]

**వచనము 13.** పౌలు తన చదువరులకు అనేక ప్రశ్నలను తెలియజేసినాడు. క్రీస్తుకు విధేయత చూపుట ద్వారా మానవ ప్రత్యేకతలను భంగపరచి, నానావిధ పరిశుద్ధాత్మ వరములపై ఆధారపడి శరీరమును విభజిచుటకు ఈ సహోదరులకు ఎంత ధైర్యము? **ఒక్క ఆత్మ ద్వారా** వారు **ఒక్క శరీరములోనికి . . . బాప్తిస్మము పొందినారని** వారికి తెలియదా? శరీరములో సభ్యత్వమునకు బాప్తిస్మములో పరాకాష్టకు చేరిన విశ్వాసము అవసరమని సంఘము పౌలుతో వాదించవలసిన అవసరములేదు. బాప్తిస్మము లోక జీవితమునుండి వారిని వేరుచేసి క్రీస్తునందు క్రొత్త జీవితము ప్రారంభించుటకు గురుతని వారు ఎరిగియున్నారు. క్రొత్తగా ఏర్పాటు చేసిన విలువల ప్రకారము జీవించుటకు సంఘ సభ్యులను హెచ్చరించుటకు (7:18-24); అపొస్తలుడు ఇంతకుముందు మాదిరిగా ఉండే ఒక వర్గీకరణ చేసినాడు (యూదులు/అన్యులు, దాసులు/స్వతంత్రులు); ఇప్పుడు ఆయన శరీరములో సభ్యత్వము మరియు భాగస్వామ్యమునకు వాటిని అన్వయిస్తున్నాడు.

12:13లో కొరింథీయులందరు *పరిశుద్ధాత్మలో బాప్తిస్మము* పొందినారను ఉద్దేశము కొరకు పౌలు వాదిస్తున్నాడని కొందరు సమర్థించినారు. ఉదాహరణకు, బాప్తిస్మము సమయములో ప్రతి క్రైస్తవుడు పరిశుద్ధాత్మ వరమును పొందినారని అదే పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందటము అని ఈ వాక్యభాగము నుండి Jack Cottrell వాదించినాడు. పేతురు మొదటి సువార్త సందేశమును ముగించినప్పుడు మరియు ప్రజలు ఆ సువార్తకు విధేయత చూపి బాప్తిస్మము పొందినప్పుడు అపొ. 1:5 యొక్క వాగ్దానము ("కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరు") నెరవేరినదని అతడు చెప్పినాడు (అపొ. 2:38-41). Cottrell ప్రకారము పెంతెకొస్తునాడు అపొస్తలులకు సంభవించినది, "పరిశుద్ధాత్మ" నుండి శక్తిని పొందుట - తక్కువైన వరము (అపొ. 1:8).[11] ఈ విషయమునకు సహకరించుటలో, కొర్నేలీ ఇంటివారిపై పరిశుద్ధాత్మ దిగివచ్చుట, సార్వత్రికమైన వాగ్దానమైన పరిశుద్ధాత్మలో బాప్తిస్మము, బాప్తిస్మమిచ్చు యోహాను బోధయొక్క అంశమైయున్నదని పేతురు గుర్తుచేసికొనినాడని అతడు చెప్పినాడు (అపొ. 11:15, 16).

పెంతెకొస్తునాడు అపొస్తలులు పంచుకొనిన అనుభవము మరియు కొర్నేలీ ఇంటివారి అనుభవము సూచనలద్వారా వెనువెంట వచ్చిన పరిశుద్ధాత్మ కుమ్మరింపు అని Cottrell చెప్పినాడు. అద్భుత దృశ్యము "పరిశుద్ధాత్మ బాప్తిస్మము"తో సమానము కాదని అతడు నొక్కి చెప్పినాడు. Cottrell ఆటంకవాది (cessationist); అనగా, (post-apostolic) గతకాలపు అపొస్తలుల సంఘములో వ్యక్తిగత క్రైస్తవులు వారి విచక్షణ చొప్పున అద్భుతములు చేయుటకు దేవునినుండి శక్తిని పొందారని అతడు నమ్మలేదు. అయినప్పటికి, Cottrell ద్వారా తెలియజేయబడిన విషయము కనీసము నాలుగు ఆలోచనలనుబట్టి లోపముగలదైయున్నది.

మొదట, యేసు తన పునరుత్థానమునకు తరువాత చివరిగా శిష్యులకు

కనిపించిన సమయములో పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి ప్రత్యేకముగా తన శిష్యులతో చెప్పినాడు. వారు "పరిశుద్ధాత్మ లో బాప్తిస్మము పొందువరకు" (అపొ. 1:5), యెరూషలేము నుండి వెళ్ళక నావలన వినిన వాగ్దానము కొరకు కనిపెట్టమని (అపొ. 1:4) మరియు ఆయనకు సాక్షులుగా ఉండమని (అపొ. 1:8), ఈ ఏర్పరచబడిన గుంపునకు ఆయన ఆజ్ఞాపించినాడు. పెంతెకొస్తునాడు జనసమూహము పేతురు సందేశమునకు స్పందించి బాప్తిస్మము పొందినప్పుడు అది నెరవేర్చబడినది (అపొ. 2:41).

రెండు, ఇంతకుముందు 1 కొరింథీ పత్రికలో నీటి బాప్తిస్మము ఉదహరించబడినది తరువాత ఇతర పత్రికలలో అది కనిపిస్తుంది. కొరింథులోని క్రైస్తవులతో పౌలు ఇలా చెప్పినాడు, "మీలో కొందరు అట్టివారైయుంటిరి గాని, ప్రభువైన యేసుక్రీస్తు నామమునను మన దేవుని ఆత్మయందును మీరు కడుగబడి, పరిశుద్ధపరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి" (1 కొరింథీ. 6:11). బాప్తిస్మమును ఆయన కడుగబడుటగా సూచించినాడు, ఈ రూపకము నిస్సంకోచముగా పరిశుద్ధాత్మ బాప్తిస్మమునకు అన్వయించబడదు. వారు కడుగబడినప్పుడు విశ్వాసులు పరిశుద్ధపరచబడుట మరియు నీతిమంతులుగా తీర్చబడుటయే గాక, ఆ క్రమమంతా "మన దేవుని ఆత్మ" ద్వారా జరిగినదని కూడ అపొస్తలుడు చెప్పియున్నాడు. అదే విధముగా, "(దేవుడు) తన కనికరము చొప్పుననే పునర్జన్మసంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను" (తీతు. 3:5) అని పౌలు చెప్పినాడు. "ఒక్క ఆత్మయందే" కొరింథీ విశ్వాసులు బాప్తిస్మము పొందినారని పౌలు చెప్పినాడు (1 కొరింథీ. 12:13), అయితే అది నీటి బాప్తిస్మమునకు విరుద్ధముగా పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి అతడు మాటలాడుచున్నాడని నిరూపించుట లేదు. పౌలు బాప్తిస్మమును కడుగుటగా సూచించినాడు, మరియు అది ఎల్లప్పుడు పరిశుద్ధాత్మ తోడ్పాటుతో జరిగినది. సందర్భము కోరుకొనినప్పుడు, పౌలు అలంకారికముగా వాడిన "బాప్తిస్మము" అను మాటను చదువరులు అర్థము చేసికొనవలెను.

మూడు, వ్యాఖ్యానించదగిన విషయముగా, క్రొత్తనిబంధనలో బాప్తిస్మము ఉదహరించబడినప్పుడు, సాధారణ సూచన నీటి బాప్తిస్మము. బాప్తిస్మమిచ్చు యోహాను నీటిలో బాప్తిస్మమిచ్చినాడు; అలాగే యేసు శిష్యులు చేసినారు (యోహాను 4:1, 2). ఫిలిప్పు మరియు ఇతియోపియుడు ఇద్దరు "నీళ్ళలోనికి దిగిరి," అంతట సువార్తికుడు అతనికి బాప్తిస్మము ఇచ్చినాడు (అపొ. 8:36). అనేక వాక్యభాగములు ఈ సత్యమును బోధిస్తున్నాయి. 1 కొరింథీ. 12:13లోని బాప్తిస్మము నీటి బాప్తిస్మమని సంపూర్ణముగా అర్థము చేసికొనబడుతుంది.

నాలుగు, పరిశుద్ధాత్మలో బాప్తిస్మము, బాప్తిస్మమిచ్చు యోహాను మాటల నెరవేర్పు మరియు వాగ్దానముతో కలసి మాత్రమే క్రొత్తనిబంధనలో కనిపిస్తుంది (మత్తయి 3:11; మార్కు 1:8; లూకా 3:16; అపొ. 1:5; 11:16). యేసు తన అనుచరులందరికి అగ్నిలో బాప్తిస్మమిచ్చినాడు తప్ప, ఎంతమాత్రమును పరిశుద్ధాత్మలో బాప్తిస్మము ఇవ్వలేదు. అపొ. 11:15-17లో పేతురు వివరించినది అన్య

విశ్వాసులకు నీటి బాప్తిస్మము నిషేధించటము కాదు, అది నీటి బాప్తిస్మమును సూచించు ఒక అసాధారణమైన సంఘటన (అపొ. 10:47). “యేసుక్రీస్తు నామమందు” కొర్నేలీ మరియు అతని ఇంటివారు నీటిలో బాప్తిస్మము పొందినప్పుడు (అపొ. 10:48) మాత్రమే వారు, కొరింథీ విశ్వాసుల వలె, **ఒక్క ఆత్మలోనిది** త్రాగునట్లు చేయబడినారు. బాప్తిస్మము పొందినప్పుడు మాత్రమే వారు నీటిలో కడుగబడినారు, పరిశుద్ధపరచ బడినారు మరియు నీతిమంతులుగా తీర్చబడినారు. లేకపోతే, వారు నీటిలో బాప్తిస్మము పొందుట అర్థరహితమౌతుంది.

## అనేకమైన అవయవములు ఒక్క శరీరము (12:14-26)

ఆత్మీయ వరములను వర్ణించి అవి “అందరి ప్రయోజనము కొరకు” (12:7) అనుగ్రహింపబడినవని ప్రకటించిన తరువాత పౌలు చెప్పిన దానిని గూర్చి కొన్ని అభ్యాసపూర్వక సూచనలను అతడు అభివృద్ధిచేసినాడు. 12:12లో, “శరీరమొక్కటే”; అని స్థిరముగా చెప్పినాడు, అయితే భౌతిక శరీరమువలె సంఘము, అనేక అవయవ ములతో ప్రయోజనకరముగా పనిచేయవలసిన అవసరమున్నది. కొరింథులోని క్రైస్తవులు వారు కోరదగినవని ఆలోచించిన వరములపై మాత్రమే దృష్టి నిలిపినప్పుడు, వారు ఏకమైయున్న శరీరమును క్షీణింపజేస్తున్నారు. అతని జాబితా చివరిలో భాషలు మాటలాడు వరమును ఉంచుటవలన (12:10), అది ఆత్మయొక్క స్వల్ప అనుగ్రహమని పౌలు సూచించలేదు, ఎందుకంటె ఏ అనుగ్రహములు స్వల్పమైనవి కావు. కొరింథులో కొందరు వరమును మరీ గొప్పదిగా తలంచుచున్నారని అతడు సూచించినాడు. సంఘ నిర్మాణము కొరకు పరిశుద్ధాత్ముడు అనుగ్రహించిన వరములకు కొరింథీయులు విలువ కడుతున్నారు, ఇది శరీరములో విభజనను ప్రముఖముగా కనబడేటట్లు చేస్తుంది. పౌలు 1 కొరింథీ పత్రిక వ్రాయుచుండగా సంఘ ఐక్యత అతని మనస్సులో నుండి ఎప్పటికి దూరము కాలేదు, అయితే ఇతర స్థలములలో ఎక్కడ లేనట్లు, శరీరములోని ఆత్మీయ వరములను గూర్చిన అతని చర్చలో మాత్రమే ఐక్యత స్పష్టముగా కనిపిస్తుంది.

**[14]శరీరమొక్కటే అవయవముగా ఉండక అనేకమైన అవయవము లుగా ఉన్నది. [15]- నేను చెయ్యి కాను గనుక శరీరములోని దానను కానని పాదము చెప్పినంతమాత్రమున శరీరములోనిది కాకపోలేదు. [16]మరియు - నేను కన్ను కాను గనుక శరీరములోని దానను కానని చెవి చెప్పినంతమాత్రమున శరీరములోనిది కాకపోలేదు. [17]శరీరమంతయు కన్నయితే వినుట ఎక్కడ? అంతయు వినుటయైతే వాసన చూచుట ఎక్కడ? [18]అయితే దేవుడు అవయవములలో ప్రతిదానిని తన చిత్తప్రకారము శరీరములో నుంచెను. [19]అవన్నియు ఒక్క అవయవమైతే శరీరమెక్కడ? [20-21]అవయవములు అనేకములై నను శరీర మొక్కటే. గనుక కన్ను చేతితో - నీవు నాకక్కరలేదని చెప్పజాలదు; తల, పాదములతో – మీరు నాకక్కరలేదని చెప్పజాలదు. [22]అంతేకాదు, శరీరముయొక్క అవయవములలో ఏవి మరి బలహీనముగా కనబడునో అవి మరి అవశ్యములే. [23]శరీరములో ఏ అవయవములు ఘనతలేనివని తలంతుమో ఆ అవయవములను మరి**

**ఎక్కువగా ఘనపరచుచున్నాము. సుందరములు కాని మన అవయవములకు ఎక్కువైన సౌందర్యము కలుగును. [24-25]సుందరము లైన మన అవయవములకు ఎక్కువ సౌందర్యము అక్కరలేదు. అయితే శరీరములో వివాదము లేక, అవయవములు ఒకదానికొకటి యేకముగా పరామర్శించులాగున, దేవుడు తక్కువ దానికే యెక్కువ ఘనత కలుగజేసి, శరీరమును అమర్చియున్నాడు. [26]కాగా ఒక అవయవము శ్రమపడునప్పుడు అవయవము లన్నియు దానితో కూడ శ్రమపడును; ఒక అవయవము ఘనత పొందునప్పుడు అవయవములన్నియు దానితోకూడ సంతోషించును.**

**వచనము 14.** ఒక్క శరీరము యొక్క స్వభావమును మరియు దానిలోని ప్రతి సభ్యుని యొక్క ప్రాముఖ్యతను ఈ క్రైస్తవులు అర్థము చేసికొనవలెనని పౌలు కోరుకొనినాడు. సంఘటితమైన సంఘము యొక్క గొప్ప సంపూర్ణతలో అతని/ఆమె వంతును ప్రతి క్రైస్తవుడు అర్థము చేసికొనుట క్రీస్తు శరీరము యొక్క సంక్షేమము కొరకు ప్రాముఖ్యమైయున్నది. సంఘములోని ప్రతి సభ్యుడు సంఘములో ఇతరుల ద్వారా పోషింపబడు పాత్రలను అభినందించవలసి యున్నది; మరియు సమయము వచ్చినప్పుడు ప్రతిఒక్కరు ఇతరుల అభిప్రాయములను గౌరవించవలెను. సంపూర్ణమైనదాని సంక్షేమము కొరకు క్రైస్తవులు పరస్పర సంబంధ సందర్భమును అవలంభించుట మొదటి ప్రాముఖ్యతయై యుండవలెను. ఎవరు అధికారము చెలాయించకూడదు; నిర్మించుటకు ప్రతివారు తమ వంతు సహాయము చేయవలెను.

గ్రీకు-రోమా సమాజములో కొంతమంది పౌరులు అభివృద్ధి చెందినప్పుడు, ఆర్థికముగా అదనపు సౌకర్యములు గలవారియొక్క ప్రయోజనములు ప్రతివారికి ప్రవహిస్తాయి అనేది ఒక ఉద్దేశము. యేసు పుట్టుకకు దగ్గర సమయములో, రోమా చరిత్రకారుడైన Livy (క్రీ.పూ. 59-17) రోమా ఉన్నత వర్గము యొక్క అవకాశములను న్యాయమైనవిగా చూపుటకు రోమా సెనేట్ సభ్యునిద్వారా చెప్పబడిన ఒక కథకు వాటిని సంబంధింపజేసినాడు:

> మనుష్యుని అవయవములన్ని ఒకదానితో ఒకటి అంగీకరించని సందర్భములో, ఇప్పటి సందర్భమువలె, ప్రతిది దాని దాని స్వంత ఉద్దేశములు కలిగి, ప్రతిది దాని దాని స్వంత గొంతును వినిపించినవి; వాటన్నిటి మధ్య పొట్ట ఏమీ చేయకుండ దానికందించే ప్రతి మంచి పదార్థమును ఆనందిస్తూ కదలకుండ ఉండియుండగా; ఇతర భాగములు శ్రమపడి మరియు పొట్టకు అందించే ప్రతిదాని కొరకు పనియుటకు కలతచెంది అది సరైనది కాదని అనుకొన్నవి; అందుకని అవన్నీ కుట్రపన్ని చేతులు నోటికి ఆహారము అందించకుండ, నోరు దానికి అందించబడిన దీనిని స్వీకరించకుండ, అవి తీసికొనినవాటిని పండ్లు నమలకుండ ఉన్నాయి. ఈ కోప స్వభావములో అవి పొట్ట వాటికి లోబడవలెనని దానిని పస్తు ఉంచినవి, అవయవములన్ని మరియు శరీరమంతా బాగా నీరసమై తగ్గిపోయినవి. కాబట్టి చేయుటకు పొట్టకు వ్యర్థమైన పని లేదని మిగతావాటిని పోషించినట్లు శరీర భాగములన్ని జీవించి వృద్ధిచెందునట్లు వాటికి సరఫరా చేయుట ద్వారా అది కూడ పోషింపబడుతుందని వాటికి స్పష్టమైనది . . .[12]

ఆర్థిక పరిధిలో చరిత్రకారుని వాదములయొక్క విలువ ప్రశ్నించబడవచ్చును, అయితే వ్యక్తిగత సభ్యులకు దేవుడిచ్చిన వరములనుండి సంఘముయొక్క సర్వశరీరము లబ్ధిపొందవచ్చు ననునది వాస్తవమైయున్నది. Livy తెలియజేసిన వాదములాంటి దానితో పౌలు పరిచయము కలిగియుండవచ్చును లేకపోవచ్చును, అయితే సాంఘీక సంక్షేమము మరియు అభివృద్ధికొరకు పూర్తి శరీర ప్రయోజనము కొరకు భాగములు పనిచేయుటను అన్వయించుట గ్రీకు-రోమా ప్రపంచములో సర్వసాధారణము.

**వచనము 15.** వరుస గమనికలతో, పౌలు పరస్పర అవసరత మరియు ప్రయోజనము యొక్క సత్యమును నొక్కిచెప్పినాడు. **పాదము** చేయవలసిన పని **చెయ్యి** చేయవలసిన పనికంటె ప్రాముఖ్యమైనది కాదు, అయితే అది సమానముగా అవసరమై యున్నదని పౌలు చూపినాడు. **నేను శరీరములోని దానను కానని** పాదము నిర్ణయించవచ్చునా, అలాగైతే శరీరమునకు అది చేస్తున్న పని తగ్గింపబడదా? ఒకదానికొకటి సంబంధముగల పాదము మరియు చెయ్యి యొక్క యోగ్యతను వర్గీకరించటము సాధ్యము కాదు లేక కోరతగినది కాదు. పని యొక్క ఉపయోగిత అది కనిపిస్తున్నట్లే ఉండదు అనునది నిశ్చయము. ఒకవేళ శరీరము యొక్క ఒక భాగము - పాదము - అది దాని పనికి సరిపడ గుర్తింపు పొందుటలేదని అనుకొనినట్లయితే - సమస్య వస్తుంది. అపొస్తలుని విషయము స్పష్టముగా ఉన్నది: శరీరములో ఏ భాగమైనా అది సంపూర్ణమైన శరీరములో అతుకబడి వేరుచేయ బడలేని ఒక భాగమని మరచిపోయి, వ్యక్తిగత ప్రయోజ నము వెదకుచున్నట్లయితే అది బుద్ధిహీనతయొక్క ఔన్నత్యము అవుతుంది. సంపూర్ణ శరీరము యొక్క సంక్షేమమునకు వెలుపల ఏ శరీర భాగము అభివృద్ధి చెందలేదు.

కొరింథులోని చిన్నచిన్న అసూయలు మరియు విభజనలకు పౌలు వాదన అతని ప్రత్యుత్తరమైయున్నది. బాగా దృశ్యమైన ఆత్మీయ వరములు తక్కువగా కనబడు వరములను వాటి ఫలితములు తక్కువని వాటిని కొట్టివేయలేవు. వ్యతిరేకముగా, ప్రజలను తక్కువ ఆకర్షించు వరములకు బదులు బాగా గుర్తింపబడిన వరములను వాంఛించకూడదు.

**వచనము 16.** పౌలు విశ్లేషణలో మొదటి భాగము పాదము మరియు చేతిని ప్రక్కప్రక్కన ఉంచుట; రెండవ దృష్టి రెండు ఇంద్రియములపై ఉంచినాడు - **చెవి** మరియు **కన్ను**. శరీరముయొక్క అవయవముల మధ్య పోలికలేని నమూనాల విరుద్ధత కొరకు అపొస్తలుడు ప్రయత్నించుటలేదు. ఆయన సంఘమును ఇముడ్చు కొన్న అవయవములకు సరిపోలిన సంక్షేమమును ఉదహరించు చున్నాడు. తరువాత పోలిక చేయబడినది (12:21); అయితే ఈ విషయము దగ్గర, పౌలు కేవలము పాదము, చెవి వాటి స్వాతంత్ర్యమును గూర్చి స్థిరముగా చెప్పుచున్నట్లు చిత్రించినాడు. ఉదాహరణలో, పాదము చేతితో కలిసియుండుటకు లేక చెయ్యి చేయు పనిని అభినందించుటకు ఆసక్తి లేనట్లు చూపించబడినది, అలాగే చెవి కంటికొరకు ఎలాంటి ఆసక్తిని కనుబరచలేదు.

అపొస్తలుని విశ్లేషణలో, సంపూర్ణ శరీరమునకు ఇచ్చుట లేక దానినుండి తీసికొనుట అను ఆలోచన మరియు సంబంధము లేకుండ, పాదము మరియు చెవి

వాటి స్వంత చిన్న ప్రపంచములో బంధింపబడియున్నవి. స్వార్థవాదము సరిహద్దులో స్థిరపడువారికి నీతికావచ్చును, అయితే, ఒక సమాజపు ప్రజలు ఆత్మీయ, ఉద్రేక మరియు భౌతిక అభివృద్ధికొరకు ఒకరిపై ఒకరు ఆధారపడినవారికి అది పని చేయదు. ఒకవేళ, ఉదాహరణముగా చెప్పబడిన పాదము, చెవి; కొరింథులో ఆత్మ వరములు పొందిన కొందరు సహోదరుల యొక్క ఇంద్రియజ్ఞానము లేనిదానికి సంకేతమైయుండ వచ్చును.

**వచనము 17.** శరీరములో చెవికంటె కన్ను సహాయము ఎక్కువగా ఉన్నదని గట్టిగా అభినందించు ఆసక్తి పౌలుకు లేదు. అతని సంబంధము వాటి పరస్పర ఆధారముపై ఉన్నది. శరీరములో ఏ ఒక్క భాగము భాగములన్ని పెట్టబడకుండ పనిచేయదు. **శరీరమంతయు కన్నయితే వినుట ఎక్కడ?** అని అపొస్తలుడు అడిగినాడు. సంపూర్ణ శరీరమునకు ఎక్కువ సహాయపడేది కన్నా లేక చెవా, పాదమా లేకా చెయ్యా అను చర్చలోనికి లాగబడకుండునట్లు అతడు చాలా జాగ్రత్తగా ఉన్నాడు.

తన విశ్లేషణ ద్వారా పౌలు ఉద్దేశమును గూర్చి కొరింధీయులకు కచ్చితముగా సంశయములేదు. దానిని వారు గ్రహించక ముందే బహుశా వారు పోల్చిచెప్పుట ప్రారంభించినారు, అదే విధముగా యేసు శ్రోతలు ఆయన ఉపమానములలో పట్టబడినారు. "ప్రతి సంఘ సభ్యుడు ఆకలిగొనినవారికి ఆహారము పెడితే ఏమిటి? అయితే విశ్వాసములో బలహీనులైన వారిని పోషించుటకు ఎవరు ఆసక్తి కలిగిలేరు" ఇలాంటి ప్రశ్నలు వారిని అడుగవలెనని పౌలు కోరుకొనినాడు. భౌతిక శరీరము వివిధ అవయవముల సహాయమునకు సంబంధించిన అర్హతను ఒకదానికి బదలాయించినట్లయితే, అది అవయవములన్నిటికి హాని చేసినట్లవుతుంది.

**వచనము 18.** ఏ విశ్వాసియైనా ఇతరుల సహాయమును అభినందించలేక పోయినట్లయితే, దేవుడు తన చిత్తప్రకారము ప్రతివానికి పంచిఇచ్చిన తలాంతులపై అతను ప్రతిఫలించవలెను. భౌతిక శరీరము మరియు సంఘము అనగా క్రీస్తుయొక్క ఆత్మీయ శరీరము రెండింటిలో - సభ్యులకు వేరువేరు పాత్రలను నియమించేది దేవుడు. **దేవుడు అవయవములలో ప్రతిదానిని తన చిత్తప్రకారము శరీరములో ఉంచెను.** విషయమదయితే, వారేమైయున్నారో మరియు వారేమిచేస్తున్నారో దానికి క్రైస్తవులందరు గౌరవించుకొనవలెను. చిన్నదా, పెద్దదా అనే భేదములేకుండ ప్రతి సహాయము, క్రీస్తు శరీరమును కట్టుటకు ప్రాముఖ్యమైయున్నది. ఏ వరముకూడ ఒక సహోదరునికి అవమానము కలిగించి మరొక సహోదరునికి హోదా కలిగించుటకు కాదు. పరిశుద్ధాత్ముడు దైవత్వములో భాగమని వివరించు అవసరతను అపొస్తలుడు గమనించలేదు; గతములో పరిశుద్ధాత్మకు అపాదించబడిన వరములు ఇప్పుడీవచనములో దేవునికి ఆపాదించబడినవి.

**వచనము 19.** కొరింథులోని ఏ క్రైస్తవుడైనా తన స్వంత పనినిబట్టి తీర్పు తీర్చుకొనుట అంత ప్రాముఖ్యమైన విషయము కాదు, అక్కడ ప్రతిఒక్కరు కచ్చితముగా అతనివలె ఉన్న సంఘ దృశ్యములో ప్రతిబింబించవలెను. ప్రతి సభ్యుడు ఆత్మనుండి ఒకే వరమును పొందియున్నట్లయితే, **శరీరమెక్కడ?** అని పౌలు అడిగినాడు. అనేకమంది సభ్యులు అనేక విషయములు చేయకుండ శరీరము ఉండనేరదు.

కొరింథులోని క్రైస్తవులు ఆత్మీయ ప్రజలుగా ఉన్నందుకు స్పష్టముగా గర్వపడుతున్నారు, అయితే వారు ఆత్మీయము అనుకొనుదాని విషయములో పౌలు వారితో విభేదించినాడు. దేవుని సంతోషపరుస్తున్న ప్రజలము అనుటకు వారు తమ జ్ఞానమును రుజువుగా చూపిస్తున్నారు. వారి జ్ఞానము వారిలో కొందరు వైరాగ్యపు సూత్రములను అవలంభించునట్లు వారిని పురికొల్పినది. వారు "స్త్రీని ముట్టకుండుట పురుషునికి మేలు" అని చెప్పుకొంటున్నారు (7:1). సందేహాస్పదమైన ప్రవర్తనను వారు సహించుటకు వారి అద్వితీయ జ్ఞానము రుజువని, ఆకరికి ఆత్మసంతృప్తి అనికూడ మరికొందరు సమర్థించుకొంటున్నారు (5:1, 2). జ్ఞానమును సంపాదించుట ఆత్మీయతకు హామీకాదని; దానికి విరుద్ధముగా, వారి ప్రవర్తన వారు దేవుని సంతోషపరుస్తున్నట్లు సూచించుట లేదని, అపొస్తలుడు ఆ ప్రజలను సవాలు చేసినాడు.

వారు ఆత్మీయ ప్రజలు అనుటకు మరొక సూచన, వారి ఆత్మీయ వరములని వారు అనుకొంటున్నారు. 12 నుండి 14 అధ్యాయముల వరకు, మేలైన ఆత్మీయ వరముల ఏర్పాటు యొక్క వారి ఉద్దేశమును పౌలు ప్రశ్నించినాడు. వారి వరములన్నిటిపై వారు భాషలతో మాటలాడుటకు విలువనిస్తున్నారు; అయితే 12:8-10లో పౌలు ఆత్మీయ వరముల జాబితాలో, భాషలతో మాటలాడుట చివరిలో ఉన్నది. ఆత్మీయముగా ఉన్నారను వారి ఉద్దేశమును పౌలు తిరిగి నిర్మించ కోరుకొంటున్నాడు; నిజమైన ఆత్మీయతకు ప్రేమకలిగిన ప్రజలుగా ఉండుట మార్గమని అతడు సూచిస్తున్నాడు. శరీర ఐక్యతను సాధించుటకు, స్వచ్ఛమైన ఆత్మీయత, నమ్రత అవసరము కాని, జ్ఞానము కాదు; భాషలు మాటలాడుటకన్న లేక ఇతర అద్భుత శక్తులకన్న ప్రేమించుట అధిక విలువైనదని సహోదరులు తెలిసికొనవలెనని అతడు కోరుకొనినాడు.

**వచనములు 20, 21.** అలంకారము యొక్క అపొస్తలుని వినియోగము స్పష్టముగా ఉన్నది. శరీరములు, ఆత్మీయమైనవైనా లేక అక్షరార్థమైనవైనా, అవి అనేక అవయవములతో చేయబడతాయి. ప్రతి అవయవము పూర్తి శరీరముయొక్క సంక్షేమము కొరకు పనిచేయవలెను. **అవయవములు అనేకములైనను శరీర మొక్కటే** అని దేవుడు ఆజ్ఞాపించుటవలన, భౌతిక దేహము గాని లేక సంఘము గాని వేరే విధముగా పనిచేయలేవు.

మొదటి శతాబ్ధపు చివరిలో, విశాల మానవ కుటుంబములో ఒక్కొక్క వ్యక్తి భాగము పంచుకొంటాడని వాదించుట ద్వారా స్తోయికు తత్వవేత్తలు అలాంటి విషయమునే సూచించినారు. "నీవేమిటి?" అని అడిగి అతడీ జవాబును ఇచ్చినాడు:

> ఒక మానవుడు. నీవు ఇప్పుడొక విడివడిన భాగముగా నిన్ను నీవు అనుకొనినట్లయితే, నీవు వృద్ధాప్యములో జీవించుట, ధనవంతు డవగుట, సంపదను అనుభవించుట నీకు సహజము. అయితే నీవు ఇప్పుడు ఒక పూర్తిదానిలో భాగమని మరియు నీవు ఒక మనిషివని అనుకొన్నట్లయితే, ఆ పూర్తియైన దానికి సంబంధించి నీకు ఇప్పుడు జబ్బుచేసినది, ఇప్పుడు పడవ ప్రయాణము చేసి సాహసములు చేయవలసిచ్చినది, అయితే ఇప్పుడు ఒక అవసరత ఇచ్చినది, మరియు నీ సమయము రాకముందే మరణించవలసి వచ్చనది. అలాంటప్పుడు నీవు విసుగుచెందటము ఎందుకు? ఒక పాదముగా నీవు విడిపోయినట్లయితే, నీవు ఇక

ఎంతమాత్రము పాదముగా ఉండవని, అలాగే నీవు కూడ విడివడిపోతే ఒక మానవుడిగా ఉండవని నీకు తెలియదా? మొదట దేవతలను మరియు మానవులను చేసిన ఒక రాజ్యము, మరియు అది మరొకదానికి చాలా దగ్గరగా ఉన్నదని చెప్పబడిన రాజ్యము, అది సార్వత్రిక రాజ్యములో చిన్న నకలని చెప్పబడిన రాజ్యము . . . ఆ రాజ్యములో భాగముగా; ఇప్పుడు నీవు జ్వరముచేత జబ్బుపడ్డ ఎవరివో ఒకరివా, సముద్ర ప్రయాణముచేయు ఎవరివో ఒకరివా, మరణించుటకు ఎవరివో ఒకరివా, నిందింపబడుటకు ఎవరివో ఒకరివా? అలాంటి శరీరములో మనది అనుకొనుట అసంభవము, మనలను మడిచి ఉంచిన ఈ విశ్వములో, మన సహ సృష్టియైన ఇతర జీవులలో, అలాంటి విషయము సంభవింపదు, ఒకరికి ఒక మనిషివి మరొకరికి ఇతర మనిషివి.[13]

ఈ విషయము వరకు, అపొస్తలుడు శరీరములో వైవిధ్యమును నొక్కిచెప్పినాడు. శరీరములోని ప్రతి అవయవము దాని స్వంత పద్ధతిలో పనిచేయుటకు శరీరములోని ఇతర భాగములపై ఆధారపడవలెను. ఆత్మ తన చిత్తప్రకారము వేరు వేరు వరములను అనుగ్రహిస్తాడు. ప్రతి క్రైస్తవుడు అతని లేక ఆమె స్వంత పద్ధతిలో సంఘము యొక్క అవసరతలకు సహాయపడతారు. పాదమునకు చెయ్యి అవసరమైనట్లే చెవికి కన్ను అవసరమైయున్నది, పూర్తి శరీర ప్రయోజనము కొరకు సహోదరులు ఒకరిపై ఒకరు ఆధారపడతారు. **నీవు నాకక్కరలేదు** అని వ్యతిరేకత వస్తే, అపొస్తలుడు ఇంతకు ముందు చేసిన హెచ్చరికలో అది సూచనయైయున్నది, అతడు దానిని 12:21లో స్పష్టము చేసినాడు. శరీరములో ఇతరుల పనిని లేక కార్యములను అప్రతిష్టపాలు చేసే హక్కు ఏ క్రైస్తవునికి లేదు, ఎందుకంటె అతని స్వంత సహాయముకంటె వారిది ప్రత్యేకమైనది.

సభ్యుల పరస్పర ఆధారము కొరకు అతడు వాదించుచుండగా కన్ను, చెవి, పాదము మరియు చెయ్యి ఇంతకుముందే పౌలు ఉద్దేశమును నెరవేర్చినవి. ఈ జాబితాలో చెప్పబడిన శరీరభాగములు వేరు వేరు వరములను పొందిన వ్యక్తిగత క్రైస్తవులను సూచించు చున్నవి (12:15, 16). అపొస్తలుడు ఉదాహరణను క్రొత్త దిశలోనికి త్రిప్పుచున్నాడు. అధికముగా కోరదగిన వరములను పొందినవారు అలాంటి వరములు లేనివారితో పోటీ పడుతున్నారు. వారి వరములు ఉన్నతమైనవని డంభము చూపుటయే కాక, వారు వాటిని పొంది నందుకు వారుకూడ ఉన్నతులనే అనుకొంటున్నారు. తక్కువ వరములు పొందినవారితో లేక అద్భుత వరములు లేనివారితో వారికి సంబంధము లేదని అనుకొంటున్నారు. విలువైన ఆత్మీయ వరములను పొందుటనుబట్టి ఉన్నత భావము వారిలో ఉప్పొంగుట, పేదవారు తమ ఆహారములో భాగము పంచుకొనుట నుండి భౌతికముగా అభివృద్ధిచెందిన క్రైస్తవులు తమ్మును తాము వేరు పరచుకొను పద్ధతితో సరిపోల్చబడినది (11:20, 21). రెండు విషయములలో, శరీర ఐక్యతకు మచ్చ ఏర్పడినది.

పౌలు ద్వారా సంబోధించబడిన పురాతన సంఘములోవలె, నేటి సంఘములో, తక్కువ పాత్రలను పోషించువారు వారి పని తక్కువ ఫలితములను ఇస్తుందని తలంచి నిరుత్సాహపడుతున్నారు. శరీర సంక్షేమమునకు ప్రతి సభ్యుడు ముఖ్యమైన వాడే అని పౌలు నమ్మిక కలిగిస్తున్నాడు. ఇతర విషయములలో, సంఘములో దృశ్యమైన

పనికలిగిన క్రైస్తవుడు తక్కువ గమనించదగిన పనులు చేయువారిని అమర్యాదగా చూచు స్వభావము కలిగి యుండవచ్చును. క్రొత్త వెలుగులో వారి స్వంతపనిని చూడవలెనని పౌలు కొరింథీయులను పిలుస్తున్నాడు. శరీర సంక్షేమము కొరకు ముందుకుసెట్టు పద్ధతిలో అనేకమైన ఇతర అవయవములు పనిచేయుటనుబట్టి మాత్రమే రాజ్యములో వారి విజయము సాధ్యమౌతుంది.

**వచనము 22.** శరీరములోని అవయవములు **ఏవి మరి బలహీనముగా కనబడి**, నిశ్శబ్దముగా వాటంతట అవే పనిచేయునో అవి కచ్చితముగా గమనించతగినవి కావు. శరీర విశ్లేషణను కొనసాగిస్తు, అపొస్తలుడు హృదయము, ఊపిరితిత్తులు మరియు మూత్రపిండములైన అంతర్గత అవయవములను తన మనస్సులో కలిగి యుండవచ్చును. ఇవి లేకుండ శరీరము పతనమౌతుంది; అయితే చెయ్యి, కన్ను, లేక ఆకరికి మెదడు పక్షముగా వాటిపనిని గుర్తించవలసిన అవసరము లేదు. కండరములు అర్థవంతముగా ప్రతిస్పందించి శరీరమును నడిపించుటకు మరియు జ్ఞానేంద్రియ ములు శరీరమునకు సమాచారము నిచ్చుటకు వాటిపని సరియైనదిగా ఉండుట అవసరమైయున్నది. “నీవు నాకక్కరలేదు” అని చెప్పు సామర్థ్యమునకు అవతల, శరీరము దాని తక్కువ గమనిక గల భాగములపై మరియెక్కువగా ఆధారపడుతుంది. అదే విధముగా, ప్రభువు ప్రజల యొక్క శరీరములో, ఎదురు చూడ బడినట్లు కష్టపడి సహాయము చేయువారిలో, ముందుకు సెట్టు పద్ధతుల నష్టము పూడ్చరానిది. శరీర సంక్షేమమును గుర్తుపెట్టుకొని సంఘములోని ప్రతి సభ్యుడు మంచిగా పనిచేయుట వ్యక్తిగత గుర్తింపుకంటె అధిక ప్రాముఖ్యమైనది.

**వచనము 23.** అంగవిశ్లేషణలో నిర్దుష్ట భాగములకు ముఖ్యమైన పని ఉంటుంది అయితే అది సాధారణముగా మర్యాదకరమైన సంభాషణ యొక్క అంశము కాదు. అవి శరీర అవసరతలకు వ్యక్తిగతముగా, స్వంతగా పనిచేయుటవలన **ఘనతలేనివని** తలంచబడుతుంది. వాటిని ప్రత్యేక పద్ధతిలో కప్పిఉంచుట ద్వారా శరీరముయొక్క ఈ భాగముపై ప్రజలు **ఎక్కువగా ఘనతను** ఉంచుతున్నారు. కాబట్టి **సుందరము కాని మన అవయవములకు ఎక్కువైన సౌందర్యము కలుగును.** పౌలు పత్రికలను జాగ్రత్తగా చదివిన కొరింథీయులు ఒకవేళ గ్రంథమంతట అపొస్తలుడు నొక్కి చెప్పిన ఉద్దేశమును గుర్తించియుంటారు: “జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములోనుండు వెట్టివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. బలవంతులైన వారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైన వారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు” (1:27-29; 2:3; 4:10; 9:22 చూడండి).

భౌతిక శరీరముయొక్క గమనించదగిన లక్షణములు మరియు ఆత్మీయ శరీరమునందలి వేరువేరు ప్రజలు లేక వివిధ రకముల ప్రజల పనికి మధ్య పోలికలను చేయుట పౌలు కొనసాగించినాడు. చివరకు, సంఘము యొక్క ఐక్యత, కలసి ఉండుట, సౌహార్దము, మరియు క్రమమైన పని అతని చింతయైయున్నది. ఆకారణమును బట్టి, సంఘము యొక్క “సుందరము కాని అవయవములు” వారు ప్రభువుకు విలువైన సేవలు అందిస్తున్నామని ఎరిగి, శరీరమునకు సహాయముచేయుట కొనసాగించుటకు పౌలు తరువాత హెచ్చరించు మాటలను చదువరి ఎదురుచూడవచ్చును. ప్రభువు వారి

సేవలను మనస్సులో ఉంచుకొని అలాంటి అవయవములకొరకు పునర్నిరీక్షణ కలిగించవలెనని ఒకడు ఎదురుచూడవచ్చును. దానికి బదులు, ఎక్కువ ఘనతగల వరములున్నవారిని తక్కువ వరములను పొందువారికంటె "ఎక్కువ సౌందర్యము కలుగునట్లు" అపొస్తలుడు బలపరచినాడు.

**వచనములు 24, 25.** శరీరము యొక్క "అధిక సుందరములైన అవయవములకు" ప్రజలు ప్రత్యేకమైన అలంకరణను ఇవ్వకపోవుట వలన, వారు "తక్కువ ఘనతగల అవయవములకు" ఇచ్చుట వలన, శరీర సంక్షేమమునకు ఒకదానికంటె మరొకటి ఎక్కువ కాదని సూచిస్తుంది. అదే విధముగా, గుర్తింపులేకుండ శరీర సంక్షేమమునకు పనిచేయు శరీర అవయవములకు దేవుడు ఘనతను ఇస్తాడు. అన్నిటి యెదుట వాటి పని తెలియజేయబడిన శరీర అవయవము లను తక్కువగా చేయవలెనని పౌలు కోరుకొనలేదు. ఇతరులను బలిపెట్టి కొందరిని చీల్చివేయవలెనని అతడు చూడలేదు; ఆయన సభ్యులందరిని ఒకేవిధముగా హెచ్చించవలెనని కోరుకొనినాడు. శరీరములో ప్రతి సభ్యుని యొక్క విలువ నిశ్చయమైయున్నది ఎందుకంటె దేవుడు శరీరమును ఆ విధముగా చేయుటవలన (συγκεράννυμι, *sunkerannumi*, "ఏర్పాటు చేయు" లేక "ఏకముగా ఉంచు") ప్రతిది దాని స్వంతమార్గములో శరీరములో దానికి రావలసిన ఘనతను పొందవచ్చును. Leon Morris ఇలా వ్రాసినాడు, "శరీరములో దేవుడు చేసిన అవయవముల ఏర్పాటు అంతటిని, ఒక ఏకమైన సంపూర్ణతలోనికి ఢీకొట్టించుట లేక మలచుటతో తీసివేయలేము."[14] కనీసము, వేరువేరు భాగములు పనిచేయుటకు ఉద్దేశించిన మార్గమది. వ్యక్తిగత ప్రతిష్టకొరకు బుద్ధిహీనమైన ప్రదర్శనను గూర్చి దేవుడు ఏర్పాటు చేసిన ఐక్యతను కొరింథీయులు వంచుతున్నారు.

**వచనము 25.** రెండు వందల సంవత్సరముల క్రితము, ఐర్లాండు నుండి యునైటెడ్ స్టేట్స్కు ఇటీవల వలసవచ్చిన పునరుద్ధరణ ఉద్యమకర్త క్రీస్తు సంఘము యొక్క దృశ్యమైన ఐక్యతకు ఇబ్బందిపడినాడు. అతడు విడిపోయిన మతశాఖ తెగలను పున రుద్ధరించవలెనని చూచుచుండగా, క్రైస్తవ ఐక్యతను సాధించటము అంత తేలికకాదని గుర్తించి వాస్తవమును Thomas Campbell ఒప్పుకొనినాడు. పరిశీలించుటద్వారా, అతని *Declaration and Address* పదమూడు ఉపసర్గములను ప్రారంభించినాడు:

> భూమిమీద క్రీస్తుసంఘము తప్పనిసరైనది, ఉద్దేశపూర్వకమైనది, మరియు చట్టబద్ధముగా ఒక్కటి; క్రీస్తునందు వారి విశ్వాసమును బహిరంగముగా చాటు అన్ని స్థలములలోని ప్రజలందరు మరియు లేఖనముల ప్రకారము అన్ని విషయములలో ఆయనకు విధేయత చూపువారు, వారి తీవ్రత మరియు ప్రవర్తన ద్వారా ఒకేదానిని తెలియజేయువారు, వారు తప్ప మరెవరులేరు; వారు తప్ప మరెవరు నిజముగా, సరిగా క్రైస్తవులని పిలువబడరు.[15]

Campbell ధైర్యమైన ప్రకటనతో పౌలు వాదించుటకు ఏమీ లేదు. క్రైస్తవులు కొన్నిసార్లు పక్షములుగా లేక మతగుంపులుగా విడిపోతారని, అయితే అది ఒక బోధకునికన్న మరొక బోధకుని అభిమానించుట కంటె మరొక మంచి కారణము కొరకు కాదని అపొస్తలుడు ఎరిగియున్నాడు. సాంఘీక హోదా, సంపద, లేక పాండిత్యము

కృత్రిమ అడ్డంకులకు కారణమైనవి. ఉద్దేశములు వేరైనప్పుడు మరియు భక్తివిశ్వాసములు ఆక్రమించబడినప్పుడు విభజన తరచుగా ఫలితమౌతుంది. సంఘము అత్యవసరముగా ఒక్కటని స్థిరముగా చెప్పుట ద్వారా విభజనకు కారణమైన పాపమును, గర్వమును పౌలు ఎదుర్కొనినాడు. **శరీరములో వివాదము లేకుండునట్లు** దేవుడు దానిని కూర్చినాడు. వ్యక్తిగత క్రైస్తవులు వారిపట్ల వారికున్నట్లు ఒకరిపట్ల ఒకరు అదే శ్రద్ధ కలిగియుండవలెనని వాదించుటకు భౌతిక శరీరములోని వివిధ అవయవములను అపొస్తలుడు ఉదాహరణగా తీసికొనినాడు. తన శరీరమైన సంఘము కొరకు దేవుని ప్రణాళిక, వారి పనినిబట్టి ఇతరులందరిని ప్రతి సభ్యుడు సన్మానించి, గౌరవించవలెను మరియు అతడు, ఆమె పొందిన వరముల ప్రకారము ప్రతిసభ్యుని పనితో అది సమగ్రముగా అతుకబడవలెను. అసూయ, ప్రధానత్వమును వెదకుట, మరియు ఎక్కువ ఘనతగల ఆత్మీయ వరములను ఆశించటము సరైన క్రైస్తవ ప్రవర్తనకు బయటున్నవని పౌలు చదువరులు అర్థము చేసికొనవలసియున్నది.

**వచనము 26.** పూర్తి శరీరమునకు శ్రమలేకుండ శరీరములోని ఏ భాగమునకు ఏమీ సంభవింపదు. ఒక అవయవమునకు కలుగు ఘనత శరీరమునకు కలిగిన ఘనత అవుతుంది. ఒక అవయవము శ్రమపడునప్పుడు శరీరమంతా శ్రమపడుతుంది. ఒక అవయవము యొక్క సంతోషము, ఉత్సాహము సమాజమంతటికి ఉల్లాసము (రోమా. 12:15 చూడండి). సంతోషించువారితో సంతోషించుటకన్న ఏడ్చువారితో ఏడ్చుట తేలికని వారు కనుగొనినప్పుడు ప్రభువు చెప్పినదానిని క్రైస్తవులు పొందలేరు. ఒకే శరీరములో పంచుకొనుట ద్వారా క్రైస్తవులు ఆత్మ బంధముచేత బంధించబడతారు. ఆత్మయొక్క వేరువేరు వరములు విభజనకు ఎప్పటికి ఆధారము కాదు.

స్వతంత్ర ప్రతిపత్తిగల పాశ్చాత్య సంస్కృతిలో, క్రైస్తవ్యము సమాజ అనుభవము అని తెలిసికొనుట కంటె విశ్వాసులకు మరేది ప్రాముఖ్యము కానట్లుంది. ఆ ఏకత్వము శరీర పనిద్వారా రాకపోయిన ట్లయితే ఏ ఏకత్వము క్రీస్తుతో అస్థిత్వము కలిగి యుండదు. “క్రీస్తు నీ స్వరక్షకుడా?”అని నేటి మతగుంపులు అడిగినప్పుడు, సాధారణమైన దానికి విరుద్ధముగా, వారు ప్రభువుతో అన్యోన్య సంబంధముకొరకు వేడుకొంటునట్లు కనిపిస్తుంది. అయితే, రక్షణ కోరుకొనువారు విధేయత చూపుటకు కొన్ని ప్రత్యేకమైన ఆజ్ఞలను దేవుడు ఇచ్చినాడు. ప్రజలు సువార్త సందేశమును వినవలెను మరియు దానిని విశ్వసించవలెను, వారి పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను, యేసు దేవుని కుమారుడని ఆయన పాపక్షమాపణ కొరకు తన రక్తమును చిందించినాడని యేసు క్రీస్తునందలి వారి విశ్వాసమును ఒప్పుకొనవలెను మరియు పాపక్షమాపణ కొరకు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను (అపొ. 2:38; రోమా. 10:8-10; 1 కొరింథీ. 1:21 చూడండి). రక్షించు క్రీస్తు యొక్క సారాంశము కేవలము యేసును తమ హృదయములలోనికి ప్రవేశించునట్లు అనుమతించుట అని తలంచువారు సంఘము మరియు మానవ శరీరము మధ్య పౌలు విశ్లేషణను జాగ్రత్తగా ఆలోచించవలసి యున్నది. యేసు తన్నుతాను ద్రాక్షవల్లిగా తనయందు విశ్వాసముంచువారిని తీగెలుగా పోల్చుకొనినాడు. క్రీస్తుకు వేరుగా ఉండి వ్యక్తిగత విశ్వాసులు మంచి ఫలములు ఫలించలేరు (యోహాను 15:1-11). అదే విధముగా,

ఆయన శరీరములో సభ్యత్వము లేకుండ వారు దేవుని గౌరవించి, మహిమ పరచలేరు.

## “కృపావరములలో శ్రేష్ఠమైనవాటిని ఆసక్తితో అపేక్షించుడి”

## (12:27-31)

**27అటువలె మీరు క్రీస్తుయొక్క శరీరమైయుండి వేరు వేరుగా అవయవములై యున్నారు.
28మరియు దేవుడు సంఘములో మొదట కొందరిని అపొస్తలులు గాను, పిమ్మట కొందరిని ప్రవక్తలుగాను, పిమ్మట కొందరిని బోధకులుగాను, అటుపిమ్మట కొందరిని అద్భుతములు చేయువారిని గాను, తరువాత కొందరిని స్వస్థపరచు కృపావరములు గలవారిని గాను, కొందరిని ఉపకారములు చేయువారినిగాను, కొందరిని ప్రభుత్వములు చేయువారినిగాను, కొందరిని నానాభాషలు మాటలాడువారినిగాను నియమించెను.
29అందరు అపొస్తలులా? అందరు ప్రవక్తలా? అందరు బోధకులా? అందరు అద్భుతములు చేయువారా? 30అందరు స్వస్థపరచు కృపావరములు గలవారా? అందరు భాషలతో మాటలాడుచున్నారా? అందరు ఆ భాషల అర్థము చెప్పుచున్నారా? 31కృపావరములలో శ్రేష్ఠమైనవాటిని ఆసక్తితో అపేక్షించుడి. ఇదియుగాక సర్వోత్తమమైన మార్గమును మీకు చూపుచున్నాను.**

క్రీస్తు శరీరములో ఐక్యత వ్యక్తిగత బాధ్యతతో ప్రారంభమవుతుంది. శరీర నిర్మాణముకొరకు కొరింథులోని నిర్దుష్ట సంఘసభ్యులకు పరిశుద్ధాత్మ వరములను ఇచ్చినాడు. అయినప్పటికి, సంఘ ఐక్యత వ్యక్తులు మరియు సంఘముల స్థాయిని మించిపోతుంది. ప్రతి సంఘము ఆయన తనకొరకు ప్రజలను విమోచించుటకు మరణించిన దేవుని క్రీస్తుకు సమిష్ట విధేయత చూపుట ద్వారా ఆయనతో కట్టబడుతుంది. సమావేశ స్థాయికి అతీతమైన సంఘు పనులకు మరియు ఒక ప్రత్యేక స్థలములో అభ్యసించు పనులకు మధ్య అపొస్తలుడు ఎలాంటి విభజన రేఖను గీయలేదు. అతని ఆసక్తి, క్రైస్తవులకు పంచబడిన వేరు వేరు వరములు మరియు తలాంతులకు సంబంధించినది. విశ్వాసులు వారి తలాంతులను మరియు సంఘ అవసరతలను సరిగా అర్థము చేసికొనినప్పుడు, అంతా అల్ప అసూయలను విడిచిపెడతారు. దేవుడు ఇతరులకు ఇచ్చిన సామర్థ్యములలో ప్రతిఒక్కరు సంతోషిస్తారు, వారి స్వంత తలాంతులు మరియు తోటి క్రైస్తవులకు ప్రభువు ఇచ్చిన తలాంతుల ద్వారా ప్రతి సభ్యుడు దేవుని గౌరవించి, మహిమపరుస్తాడు.

**వచనము 27.** క్రీస్తు శరీరము యొక్క సంక్షేమముకొరకు అతనికి, ఆమెకు దేవుడిచ్చిన సామర్థ్యములను ఒకరి తరువాత ఒకరు ప్రతి క్రైస్తవుడు ఇవ్వవలసియున్నది. శరీరమంతటికి వాటి వంతు సహాయపడు వ్యక్తిగత అవయవములు లేకుండ శరీరము ఉండదు. శరీరమనగా ఏదోఒకటి కాదు. శరీరమనగా దాని ప్రతియొక్క అవయవము, వ్యక్తిగతముగా ఆలోచించి, ఒక ఏకమొత్తముగా పని చేస్తాయి. శరీరములోని ప్రతి అవయవము ఏమి చేస్తుందో ఆ కార్యము జరిగించుటలో

అది సంఘమై యున్నది. క్రైస్తవుడు చేయు సిగ్గుమాలిన లేక గౌరవనీయమైన ఏపనైనా, ఆ చర్యలో సంఘ ముంటుంది. శరీరములో క్రైస్తవుడు ఆక్రమించుకొనని స్థలమునకు బయట క్రైస్తవ్యము ఉండదు. "క్రీస్తా, అవును; సంఘమా, కాదు" అని చెప్పు ఒంటరి విశ్వాసులను గూర్చి పౌలుకు ఏమీ తెలియదు. తన శరీరమునకు "అవును" లేకుండ, క్రీస్తుకు "అవును" ఉండదు. సంఘము వారసత్వ క్రమమని లేక ఒక భవనమని ఆలోచించువారు అపార్థము చేసికొనినారు. సంఘమనగా దేవుని ప్రజలు, ఆరాధించుట మరియు సర్వసాధారణ నిరీక్షణ కలిగి, సర్వసాధారణ జీవన విధానముతో ఒకరినొకరు ప్రోత్సహించుకొనుట చేస్తారు.

**వచనము 28. సంఘము** తరచుగా కొంతమంది స్థానిక సహవాసుల సమావేశముగా వాడబడుతుండగా, అది ప్రపంచవ్యాపిత విశ్వాసుల సమూహమును కూడ సూచిస్తుంది. పౌలు వాడిన ఆర్టికల్ (τῇ ἐκκλησίᾳ, *tē ekklēsia*) సందర్భములోనికి తీసికొనబడినది, గంథము ననుసరించిన వరముల జాబితా సార్వత్రిక మరియు స్థానిక అన్వయింపును సూచిస్తుంది. ఆత్మయొక్క స్వస్థపరచు వరము ప్రక్కనే అపొస్తలత్వము నిలిచినది. అపొస్తలుని యొక్క పని అధికారమును సూచిస్తుంది (మత్తయి 28:16-20 చూడండి); అపొస్తలులు ప్రతిస్థలములో ఉన్న సంఘమును హెచ్చరించుటకు మరియు ఆజ్ఞాపించుటకు పనిచేసినారు. **అపొస్తలులు** అనునది సంఘముద్వారా ఒక ప్రత్యేకమైన పనికొరకు పంపబడినవారికొరకు వాడిన సాధారణ పదము (అపొ. 14:14[16]), అయితే ఆ మాట ఆయన పునరుత్థానమునకు సాక్ష్యమిచ్చుటకు క్రీస్తుద్వారా నియమించబడిన పండ్రెండు మందికి కూడ వాడబడినది. పండ్రెండు మంది అపొస్తలులు అధికారముతో పంపబడినారు (మార్కు 16:14-18). ఆ పండ్రెండు మందికి ఇవ్వబడిన అదే పని, అధికారము పౌలుకు ఇవ్వబడినది (1 కొరింథీ. 15:9; గలతీ. 1:11, 12).

**ప్రవక్తలు**, అపొస్తలులతో కలిపి, సంఘముయొక్క బోధలలో మరియు దాని కార్యక్రమములలో సంఘమునకు మార్గదర్శకత్వము చేయుటకు దైవికముగా ప్రేరేపింపబడినవారు; అయితే అపొస్తలుల పనియొక్క అధికారము కంటె ప్రవక్తల అధికారము తక్కువైనది. అపొస్తలులతో కూడ వారిని ఉదహరించినప్పుడు, వారు రెండవ వారిగా లెక్కింపబడినారు (12:28, 29; ఎఫెసీ. 2:20; 3:5; 4:13). ఒకవేళ కొన్ని సంఘములలో అపొస్తలులు గాని ప్రవక్తలు గాని ఉండి ఉండకపోవచ్చును. ప్రపంచవ్యాపిత సంఘముయొక్క ప్రయోజనము కొరకు ఈ పనులలో సేవచేసినవారికి పరిశుద్ధాత్మ వరములను ఇచ్చినాడని పౌలు చెప్పుచున్నాడు. ప్రవక్తలు స్థానిక సమావేశ పరిధిలో మాత్రమే పనిచేసి ఉండవచ్చును, లేక వారు ఒక సంఘము నుండి మరొక సంఘమునకు కదులుతూ ఉండి ఉండవచ్చును. అపొస్తలుడు గాని, ప్రవక్త గాని లేక ఏ ఇతర పాత్ర అయినా, క్రీస్తే స్వయముగా తన సంఘములో ఉంచిన వారిని గూర్చి మాత్రమే పౌలు మాటలాడిఉంటాడు; ఆయన తన ప్రజలకు తగిన పాత్రలను "ఇచ్చియున్నాడు" (ఎఫెసీ. 4:13).

ఆత్మద్వారా ఇవ్వబడిన వరముల సాధనము ద్వారా, దేవుడు సంఘములో ఉపదేశకులను కూడ ఉంచినాడు (ఎఫెసీ. 4:13; యాకోబు 3:1 చూడండి). బహుశా,

ఉపదేశకులు అన్ని సంఘము లలో ఉండి ఉంటారు. వారు కచ్చితముగా ప్రాముఖ్యమైనవారే, అయితే వారు అధికారపూర్వక మార్గదర్శకము చేయుటకు తప్పనిసరిగా ఆత్మద్వారా బలపరచబడలేదు ఎందుకంటె వారు మూడవవారిగా లెక్కింపబడినారు. తరువాతి రెండు పదములతో, ఇంతకుముందు అతడు వ్రాసిన ఆత్మీయ వరముల జాబితాను పౌలు వెనుకకు త్రిప్పినాడు. మన కాలములో సంఘములో లేచిన ప్రశ్నలు, అద్భుత రీతిగా సంక్రమించిన ఆత్మీయ వరములనుండి సంఘ పరిచర్యకు క్రైస్తవులు సమర్పించుకొనిన సాధారణ సామర్థ్యములను, వేరుచేయుటకు విశ్వాసులను ప్రేరేపింపవచ్చును. అలాంటి ప్రత్యేకతల పట్ల పౌలుకు ఎలాంటి ఆసక్తిలేదు. వారు సాధారణ సామర్థ్యములను వాడినా లేక అద్భుత వరములను వాడినా, వ్యక్తిగత క్రైస్తవులు శరీరములో వేరు వేరుగా పనిచేయవలెనని ఆయన తెలియజేయ కోరుకొనినాడు. సంఘములో కష్టతరమైన ప్రశ్నలను సంబోధించు టకు కొంతమంది ఉపదేశకులు ఇతరులు పొందనటు వంటి, సామర్థ్యములను అద్భుతగా పొంది ఉండవచ్చును.

ఎవరికి పరిశుద్ధాత్ముడు అద్భుతశక్తులను ఇచ్చియున్నాడో ఆ క్రైస్తవులు - **అద్భుతములు** చేసినవారు - **స్వస్థపరచు** వరములు గలవారితో బహుశా విశాల వర్గమునకు చెందినవారై యుండ వచ్చును. 12:28లో తరువాతి రెండు వరములకొరకైన మాట అద్భుతములులేని సామర్థ్యములను సూచిస్తు ఉండవచ్చును. మొదటిది, **ఉపకారము** (ἀντιλήμψεις, *antilēmpseis*; "ఉపకారము చేయు"), క్రొత్తనిబంధనలో ఇక్కడ మాత్రమే కనిపిస్తుంది. ఈ పదము, కొందరు శరీరములో గాని లేక శరీరమునకు బయటగాని, ఇతరులకు చేయు ఉపకార కార్యములను సూచిస్తుందని చెప్పుట క్షేమకరమై యున్నది. ఒకవేళ ఆత్మ కనికరము, ప్రేమ కలిగిన కార్యములు చేయుటకు కొందరికి ప్రత్యేకమైన ప్రణాళికను లేక సాటిలేని అవకాశములను ఇచ్చియుండవచ్చును. తరువాతి మాట, **ప్రభుత్వములు** (κυβερνήσεις, *kubernēseis*), ఇదికూడ క్రొత్తనిబంధనలో ఇక్కడ మాత్రమే కనిపిస్తుంది. అది అభ్యాసపూర్వక విషయములలో అనగా, సమావేశమునకు స్థలము, సమయమును నిర్ణయించుట లేక సమావేశమునే నడిపించి నిర్వహించుటలాంటి పనులుచేయు నాయకత్వమును సూచిస్తుంది. కొరింథీయులు అధికముగా కోరుకొనునట్లు కనిపించు వరమును అతని జాబితాలో పౌలు చివరన ఉంచుట యాదృచ్ఛికము కాదు. భాషలతో **మాటలాడు** వరమును (12:10 చూడండి) గొప్పగా చూడవలసిన అవసరము లేదని అతడు చూపించినాడు.

**వచనము 29**. 12:29, 30లో అతని ప్రశ్నలను వ్యతిరేకముగా (μή, *mē*) ముందుకు తీసికొనివచ్చుట ద్వారా, పౌలు వ్యతిరేక జవాబులను కోరుకొంటున్నట్లు సూచిస్తున్నాడు. గ్రీకు వ్యాకరణపు బలమును పట్టుకొనుటకు, NASB **అందరు అపొస్తలులు** కారు, అవునా? అని తర్జుమాచేసినది, అలాగే ఇతర ప్రశ్నలలో అదే మాదిరిని అనుసరించినది. అసాధారణమైన వరములు, అది భాషలు మాటలాడుట కానివ్వండి, అపొస్తలత్వము కానివ్వండి లేక స్వస్థతలు కానివ్వండి, పొందినందుకు తోటి సహోదరునిపై ఎవరు అసూయ పడకూడదు. సంఘము బాగా పనిచేయుటకొరకు,

సంఘ ము దాని సభ్యులమధ్య వివిధమైన వరములను లెక్కించుట అవసరమై యున్నది. ఇతరులు కలిగియున్న వరములను గూర్చి ప్రతి సభ్యుడు సంతోషించవలెను మరియు అలాంటి వరములు దేవుడు అతనికి, ఆమెకు ఇచ్చినందుకు తృప్తికలిగియుండవలెను. పౌలు విషయమైతే, అవసరము వచ్చినప్పుడెల్ల అలాంటి వరము లను పిలచుటకు అపొస్తలత్వపు పని అతనికి అధికారము ఇచ్చియుండ వచ్చును (1 కొరింథీ. 14:18; 2 కొరింథీ. 12:12). వారు ఎలా ఉండవలెనని అతడు కోరుకొనినాడో అపొస్తలుడు కొరింథీయు లకు అలాంటి మాదిరిగా ఉన్నాడు. ఏ వరములనైతే అతడు కలిగియున్నాడో, ఆ సామర్థ్యములను క్రీస్తు శరీర సంక్షేమము కొరకు వాడినానని అతడు స్పష్టముగా చెప్పియున్నాడు.

**వచనము 30.** ప్రతి ప్రశ్నకు వ్యతిరేక జవాబును ఎదురుచూచుట ద్వారా, వరుస అలంకారిక ప్రశ్నలు అడుగుట కొనసాగింపబడినది. బహుశా, అన్ని ఒకే వరమునకు సంబంధించినవి కావు; ఒకవేళ అలా జరిగినట్లయితే సంఘము బలహీనపడిన శరీరమై యుండెడిది. శరీరములోని సభ్యులందరు పరస్పరము ఆధారపడినవారు. పూర్తి శరీర ఆశీర్వాదము కొరకు సహోదరి, సహోదరుల ద్వారా ఆనందించబ డుతున్న వరములను గూర్చి క్రైస్తవులు సంతోషించవలసి యున్నది. వరము ఏదైనప్పటికి (భాషలతో మాటలాడుట, స్వస్థపరచుట, ఉపకారములు చేయుట, లేక ప్రభుత్వములు చేయుట), ఇతరులను ద్వేషము, అసూయతో చూచు హక్కు ఎవరికి లేదు. ఇతరులు పొందిన వరములను పొందనందుకు తాను పదవీచ్యుతి పొందితినని ఎవరు ఆలోచించకూడదు. ప్రతివారు స్వస్థపరచగలిగినట్లు లేక ఇతర అద్భుతములు చేసినట్లు, క్రైస్తవులందరు భాషలతో మాటలాడరు. 12:10లో వలె, ఎవరైనా భాషలతో మాటలాడితే దానికి అర్థము చెప్పబడవలెనని, భాషలు మాటలాడుటను అనుసరించి, పౌలు మాటలాడినాడు. 14వ అధ్యాయములో ఆయన మరల అర్థము చెప్పు ఉద్దేశమునకు తిరిగినాడు.

**వచనము 31.** అతి సాధారణముగా అధ్యాయ విభజన 12:31 మధ్య భాగములో వస్తుంది. **కృపావరములలో శ్రేష్ఠమైన వాటిని ఆసక్తితో అపేక్షించుడి** అని పౌలు చెప్పినాడు; పరిశుద్ధాత్మ ద్వారా ఇవ్వబడిన వరమును పొందుట మెచ్చుకొనతగినది. మొదటి చూపులో, 12:7-11లో ఆత్మ తన చిత్తము చొప్పున ప్రతివానికి తగినట్లు వరములను ఇస్తున్నాడని అతడు చెప్పినప్పుడు ఆత్మీయ వరములను వెదకుటలో సంఘము ఆసక్తి కలిగియుండవలెనని పౌలు చెప్పుట వింతగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఒకవేళ వాటిని వెదకువారికి తగినట్లుగా ఆత్మ అలాంటి వరములను ఇచ్చినాడని కొరింథీయులు అర్థము చేసికొనవలసియున్నది. సంఘమునకు సేవచేయు ఉద్దేశ ముతో ఒక క్రైస్తవుడు నిష్పక్షపాతముగా నిర్దుష్ట వరమును కోరుకొంటే ఆ వరమును అతనిపై కుమ్మరించుటకు ఆత్మ ఇష్ట పడినట్లు కనుగొనవచ్చును. వరములను గూర్చి చర్చించిన తరువాత, పౌలు తన చదువరులను ఇంకా సరియైన ఐక్యత కలిగి యుండుట కొరకు **సర్వోత్తమమైన మార్గము**నకు నడిపించినాడు.

క్రైస్తవులు సహోదర ప్రేమపై ఆధారితమై ఒక పరిచర్య కోసం వరములను కోరుకుంటారు అనేది పౌలు యొక్క చింతయైయున్నది. ఆ దృక్కోణంనుండి, కొరింథులు దేవుని వరముల్లో అత్యంత ప్రాముఖ్యమైన (8:1; 16:14) ప్రేమ యొక్క వరమును నిర్లక్ష

పెట్టుత్తున్నారు. పౌలు అందరు కోరుకోగలిగిన వరమును వారికి చూపించాలని అనుకున్నాడు. కొరింథీయులు కోరిన ప్రాముఖ్యమైనవాటితో పోలిస్తే అది దేవుని దృష్టిలో గొప్ప వరమే.

## అన్వయము

### "క్రీస్తుసంఘము అక్కడ వెళుతున్నది"

ఇరుగుపొరుగున పేదవారుండే ఒక చిన్న భవనసముదాయ ములో ఒక వయసుమళ్ళిన స్త్రీని దర్శించవలెనని ఒక బోధకునికి చెప్పబడినది. ఆమె అంగవైకల్యము కలది. ఒక స్నేహితుడు ఆమెకు సరుకులు తెచ్చిస్తూ ఉండేవాడు. ఆమె నివసిస్తున్న భవయము నుండి ఆమె ఎప్పుడు బయటకు వెళ్ళలేదు. బోధకుడు ఆమెతో చాలినంత సమయము మాటలాడినానని చెప్పినాడు, ఆమె బాధలు, ఒంటరితనమును జ్ఞాపకము చేసికొనుట విన్నాడు మరియు తన గడియారమును గమనిస్తున్నాడు. ఒకసారి నిమిషముల ముల్లు ఒక స్థానము దగ్గరకు వెళ్ళేటప్పటికి, అతడు వెళ్ళిపోయినాడు. అతడు ఆమెను దర్శించుటకు ఆగినందుకు ఆమె కృతజ్ఞతతో పొంగిపోయినది. అతడు తన విధిని నిర్వర్తించినందుకు తృప్తిచెందినాడు - అయితే అతని కథ కొనసాగింపబడినది.

అతడు తన కారు దగ్గరకు వెళుతూ ఉండగా, వీదిలో ఆడుకొంటున్న కొంతమంది పిల్లలను అతడు దాటివెళ్ళినాడు. వారిలో ఒక పిల్లవాడు తెలిసినవాడిలా కనిపించినాడు; అతడు ఒక ఆంటీతో ఆరాధనకు హాజరయినాడు. బోధకుడు దాటివెళుతుండగా, ఆ పిల్లవాడు కూడ అతనిని గుర్తుపట్టి, "క్రీస్తు సంఘము అక్కడ వెళుతుంది" అని అతని స్నేహితునికి వివరించినాడు. అతడు నిజముగా ఆగనప్పటికి, అతని కాళ్ళు ఆగిపోవటము గమనించి నాడు. అతడు ఆ పిల్లవానికి తాను "క్రీస్తుసంఘము కానని" వివరించవలె ననుకొనినాడు, అయితే అతడు నడుస్తూనే ఉన్నాడు. ఆ పిల్లవాడు గాని, అతని స్నేహితుడు గాని ఆ వివరణను అర్ధము చేసికొనలేరని అతడనుకొనినాడు.

అయినప్పటికి, ఆ వాక్యభాగము అతని మనస్సులోనుండి వెళ్ళిపోలేదు. అమాయకుల నోటనుండి వచ్చు మాటలవలె అవి అతని మెదడులో ఉండిపోయినవి. నేను "క్రీస్తుసంఘము" కాకపోయి నట్లయితే, నేనెవరిని? అని బోధకుడు తన్నుతాను ప్రశ్నించు కొనినాడు. సంఘము ద్వారా ఓటు వేయబడినట్లయితే, ఇరుకు భవనసముదాయములో వృద్ధ స్త్రీని దర్శించుట ఎంతమాత్ర మైనా క్రీస్తు పని అవుతుందా? సంఘమంతా చేరివచ్చి ఆ వృద్ధ స్త్రీ ఇంటిలో కూర్చొన్నట్లయితే, అది సంఘము పనిలో ఉన్నట్లా? ఆ ప్లిల్లవాడు "క్రీస్తు సంఘము అక్కడ వెళుతుంది" అని చెప్పినప్పుడు, సరిగానే చెప్పినాడు.

బోధకుని మనస్సు ఆ పిల్లవాని ప్రకటనపై దృష్టి నిలిపి ఉంచినది. చివరకు ఆ పిల్లలు అతనిని చూచినప్పుడు, అతడు అనేక ఇతర విషయములు చేస్తు ఉండి ఉండవచ్చును. ఆ పిల్లవాడు అతని స్నేహితుడు అననుగుణ్యమైన పత్రిక చదువు ఒక

వ్యక్తిని చూచి "ఆ మనిషి క్రీస్తు సంఘము" అని వ్యాఖ్యానించనందుకు అతడు సంతోషించినాడు. అతని శ్వాసలో సారాయి వాసన కొట్టు మనిషిని చూచి ఆ పిల్లలు అలా చెప్పనందుకు అతడు కృతజ్ఞత కలిగి యున్నాడు. ఆ బోధకుడు విపరీతమైన అలంకరణలతో ఉన్న ఒక ఆకర్షనీయమైన యౌవన స్త్రీని దర్శించటమో లేక వృద్ధ స్త్రీ భవనసముదాయములో దూరి ఆమెను దోచుకొనుటో లేక ఆమెను అవకాశముగా తీసికొని ఏదైనా చేయటమో ఆ పిల్లలు చూడలేదు. అతని స్వంత అవకాశము కొరకు అబద్ధములు చెప్పు సంఘ ప్రతినిధిని వారు చూచియుండలేదు.

ఆ రోజున, ఒక చిన్న పిల్లవాడు "క్రీస్తు సంఘము అక్కడ వెళుతుంది" అని చూపించి చెప్పినప్పుడు, ఒంటరిగా ఉన్న, బాధపడుతున్న ఒక క్రైస్తవ స్త్రీని ఒక వ్యక్తి దర్శించుట అతడు అతని స్నేహితునికి చూపించినాడు. ఆమె బంధింపబడిన జీవితమునకు చిన్న సంతోషమును జతచేయుటకు అతడు ప్రయత్నించుట సులభ ముగా ప్రభావితులగు ఈ పిల్లలు గమనించినారు. పౌలు మాటలు అతని మనస్సులోనికి వచ్చినవి: "ఏలాగు శరీరము ఏకమైయున్నను అనేకమైన అవయవములు కలిగియున్నదో, యెలాగు శరీరము యొక్క అవయవము లన్నియు అనేకములై యున్నను ఒక్క శరీరమైయున్నదో, ఆలాగే క్రీస్తు ఉన్నాడు" (12:12); "అటువలె, మీరు క్రీస్తుయొక్క శరీరమైయుండి వేరు వేరుగా అవయవములై యున్నారు" (12:27). బోధకుడు తనకు తాను నవ్వుకొనినాడు. నిజముగా ఆయన ఆ రోజు క్రీస్తు ప్రతినిధియై యున్నాడు. మంచికో, చెడుకో; మన క్రియలు ఎల్లప్పుడు క్రీస్తు సంఘ క్రియలై ఉంటాయి.

## విశ్వాసుల సమూహము

వివరణాత్మకమైన ప్రతిపాదనలో, ఒక వ్యక్తి ఒక ఒంటరి ద్వీపమునందు వదిలిపేయబడి ఇతర ప్రజలకు వేరుగా ఒంటరిగా దేవుని ఆరాధిస్తు ఉండవచ్చును. అలాంటి దృశ్యము సాధ్యమే గాని ఎప్పుడో ఒకసారి జరుగుతుంది. దేవుని ఆరాధించే ప్రజలను బైబిలు ఎలా చిత్రించినది? *బైబిలంతటిలో దేవుని ఆరాధించుట ఒక సమూహపు వృత్త పరిధిలో సంభవించినది.* అబ్రాహాము మరియు అతని వంశపువారు కుటుంబ పరిధిలో దేవుని సేవించినారు. కుటుంబములో ప్రతివ్యక్తి ఏమి చేసినాడో లేక ఏమి చెప్పినాడో అది కుటుంబ ప్రయోజనము కొరకో లేక కుటుంబ హానికో పని చేసి ఉంటుంది. లోతు అబ్రాహామునుండి వేరు పడి, యొర్దాను లోయలో మంచి నీటివసతి గల మైదానములను ఎన్నుకొనినప్పుడు (ఆది. 13:10), ఫలితములు నాశనకరముగా ఉన్నవి. తన కుటుంబము, తన సమాజము అను పితరుని భావము, తన సోదరుని కుమారునిపై దండెత్తిన రాజులను 318 మందితో ఎదిరించి అతనిని రక్షించుటకు పురికొల్పినది (ఆది. 14:14). ఇశ్రాయేలు దేశము పితరుల సమాజముల పొడగింపైయున్నది. 1 కొరింథీ. 12లో పౌలు హెచ్చరిక బైబిలు అంతట ప్రవహించిన అంశము యొక్క పొడగింపైయున్నది. దేవుని ప్రజలు జీవిస్తారు, ఆరాధిస్తారు మరియు ఒక సమాజముగా ఒకరిపట్ల ఒకరు జాగ్రత్త తీసికొంటారు.

మానవ శరీరము యొక్క నిర్మాణక్రమము సమాజము యొక్క ఉద్దేశమును బాగా

ఉదహరించినది. గ్రామములు, నగరములు, ప్రాంతములు, రాష్ట్రములు మరియు దేశములనుండి ప్రజలు అందరి అభివృద్ధికొరకు కొనసాగుతారు. శరీరము మొత్తమునకు అతని, ఆమె వంతును ప్రతి వ్యక్తి అందించు పద్ధతిని ఉదహరించుట కొరకు శరీరముయొక్క భిన్నత్వములో ఏకత్వ ప్రణాళికను తీసికొని వచ్చుటలో పౌలే ప్రధముడు కాడు. తత్వవేత్తలు, వక్తలు తరచుగా ఈ నిర్మాణమును వాడినారు, గ్రీకు-రోమా ప్రపంచములో అది సర్వవ్యాపిత ఉదాహరణయైనది. ఇంకా సంఘస్థాయిలో సంఘము కొరకు ఈ పోలిక ముఖ్యముగా తగినట్లు ఉన్నది. మార్గమిక్కడ ఉన్నది.

*సమిష్టిగా సంఘ శరీరమంతటికి మరియు వ్యక్తిగతముగా ప్రతి సభ్యునకు, "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" అను ఆజ్ఞను క్రీస్తు ఇచ్చియున్నాడు* (మార్కు 16:15). ప్రభువు ఎన్నుకొనబడిన ఒక గుంపు బోధకులకో, యాజకులకో లేక నాయకులకో ఈ పనిని అప్పజెప్పలేదు.

దేవుడు తన ప్రజలకు ఇచ్చిన పనిలో తనవంతు సహాయము అందించుటకు అతని, ఆమె స్వంత సామర్థ్యములు లేక తలాంతులు ప్రతి వ్యక్తిగత క్రైస్తవుడు కలిగియున్నాడు. దేవుడు తనకు మరియు ఇతరులకు ఇచ్చిన సామర్థ్యములను ప్రతి క్రైస్తవుడు అభినందించి వాటిలో సంతోషిస్తాడు. అతని, ఆమె వంతు చేయుటకు ప్రతి ఒక్కరు ఇతరులపై ఆధారపడతారు. అనేక వరములు కలిగినవారు ముఖ్యముగా దీవింపబడియున్నారు, అయితే ప్రతి ఒక్కరు దేవుడు తనకు ఏ తలాంతును ఇచ్చినాడో దానిని వాడవలెను. జగడమాడుట, అసూయచెందుట క్రీస్తు శరీరమునకు నాశనకరము.

*అనేక అవయవములు ఉన్నను శరీరము ఒక సంపూర్ణ అవయవము.* ఒక అవయవము ఘనతచెందినప్పుడు, శరీరము దీవెనలో పాలుపొందుతుంది. ఒక అవయవము తన విధిలో తప్పిపోయినప్పుడు, ఒక క్రైస్తవుడు పాపమునకు లోబడినప్పుడు, ఒక మొత్తముగా శరీరము శ్రమపడుతుంది.

శరీరములో ఒక భాగముగా ఉండుట క్రైస్తవ జీవితములో ఇష్టమునకు విడువబడినది కాదు. శరీరము ఏదైనా మాదిరికరమైన సమాజ జీవితము కలిగియుండుటకు, సంఘ సమావేశము ప్రాముఖ్య మైనది. క్రైస్తవుడగుట అనగా ఒకడు యేసుక్రీస్తును తన హృదయ ములో అంగీకరించుట కంటె ఎక్కువ. దేవునియందు విశ్వాసముంచి, పాపముల విషయములో మారుమనస్సు పొంది, యేసు దేవుని కుమారుడని ఒప్పుకొని, బాప్తిస్మము పొందుటద్వారా ఒక వ్యక్తి దైవిక ఆజ్ఞలకు విధేయత చూపవలసియున్నది. ఈ విధానములో అతడు దేవుని కుటుంబములో భాగస్తుడవుతాడు. క్రైస్తవుడుగా జీవించుట, యేసుకు మరియు యేసు నామమును ఒప్పుకొనిన వ్యక్తికి మధ్య ఒంటరి విషయము కాదు. సమాజ జీవితమునుండి వృద్ధిచెందు ప్రోత్సాహము, ఆదరణ, పరిశుద్ధత, మరియు సరిచేసికొనుట దానిలో చేరిఉన్నవి. వారు అలక్ష్యము చేయబడినారని అనుకొనినప్పుడు చాలామంది క్రైస్తవులు వెంటనే ఇతరులను నిందిస్తారు, అయినప్ప టికి, వారు తమ సహాయము అవసరమైన వారిని ఆదుకొనుటలో నిదానముగా ఉంటారు.

## సూచనలు

[1]11:3-16లో తల ముసుకులను ధరించుటను గూర్చిన చర్చ ప్రత్యేకముగా సమావేశమునకు అన్వయింపబడి యుండదు. [2]ఈ పత్రికలో కొరింథులోని సంఘమునకు, "అసూయ, ద్వేషము, వివాదములు, తిరుగుబాటు . . ." వీటిని గూర్చిన సంబంధమును క్లెమెంట్చెప్పినాడు (Clement of Rome *First Clement* 3:2). [3]దాని "శబ్దార్ధముల శాస్త్రతపు రాజ్యము" ("semantic domain") ప్రకారము ఆ మాట దేనిని గుర్తిస్తుందో ఆ పూర్తి నిడివిని గూర్చి బహు భాషా కోవిధులు మాటలాడినారు. [4]D. A. Carson, *Showing the Spirit: A Theological Exposition of 1 Corinthians 12—14* (Grand Rapids, Mich.: Baker Book House, 1987), 19–22లో ఈ మాట యొక్క ఉత్తమ చర్చ ఇవ్వబడినది. [5]Jack Cottrell, *Power from on High: What the Bible Says About the Holy Spirit* (Joplin, Mo.: College Press Publishing Co., 2007), 411. [6]James Greenbury, "1 Corinthians 14:34–35: Evaluation of Prophecy Revisited," *Journal of the Evangelical Theological Society* 51 (December 2008): 724. [7]కొరింథులో ఉన్నదానికంటె అపొ. 2లో ఉన్న "భాషలు" వ్యత్యాసమైనవని Leon Morris వాదించినాడు. అనేక వ్యాఖ్యానములలోవలె అతని ఉద్దేశముకూడ అలాగే ఉన్నది. (Leon Morris, *The First Epistle of Paul to the Corinthians*, rev. ed., The Tyndale New Testament Commentaries [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985], 169.) [8]David E. Garland, *1 Corinthians*, Baker Exegetical Commentary on the New Testament (Grand Rapids, Mich.: Baker Academic, 2003), 584. [9]Robert H. Gundry, "'Ecstatic Utterance' (N.E.B.)?" *Journal for Theological Studies* 17 (1966): 299–307. [10]Jerome Murphy-O'Connor, *St. Paul's Corinth: Texts and Archaeology*, 3rd rev. and exp. ed. (Collegeville, Minn.: Liturgical Press, 2002), 191.

[11]Cottrell, 308–9. [12]Livy *Historia* 2.32. [13]Epictetus *Discourses* 2.5.25–26. [14]Morris, 173. [15]Thomas Campbell, *Declaration and Address* (St. Louis: Mission Messenger, 1978). This document can be viewed online (accessed September 25, 2015, http://www.therestorationmovement.com/_states/wv/declaration.htm#4). Campbell (1763–1854) presented the address in 1809. [16]అదే పదము 2 కొరింథీయులకు 8:23లో "దూతలు" అని అనువదించబడింది.